నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికి అం**



అత్యంతాధిక సుంకము
లత్యంతగు దగుచు ట్రంపు దాశించుటచే
సత్యంకారము నొప్పక
ప్రత్యామ్నాయములు మోడి ప్రారంభించెన్ !!

(ట్రంప్ టారిఫ్ పెంచి నందువలన ప్రధాని మోడీ ప్రత్యామ్నాయాలు వెతకడం ఈరోజు ప్రారంభించారు. ఈ విషయమై ఈరోజు కేంద్ర ప్రభుత్వ కాబినెట్ సమావేశం జరిగింది)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

**చురక**


క్రమశిక్షణ ప్రతి పార్టీలో
కట్టు తప్పుతున్నది
పరువుదీస్తూ స్వార్థస్వేచ్ఛ
పరుగుపెడుతూ ఉన్నది.
నీతి ఖ్యాతి మాదంటూ
నీల్గుడింకా ఎందుకు
వేలుపెట్టి ఎదుటివాళ్ల
విమర్శించేటందుకు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 13-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93. Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:9 పేజీలు:6 వెల: రూ.1/-

## సిట్ చేతికి 'సృష్టి' కుసు !



హైదరాబాద్, ఆగష్టు 12:సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసును స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)కి బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం ఈ విషయాన్ని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు.

ఈ కేసులో మొత్తం ఎనిమిది ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయని డీసీపీ వివరించారు. ఇప్పటివరకు కేసులో 25 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆమె తెలిపారు. అరెస్టైనవారిలో డాక్టర్లు, ఏజెంట్లు ఉన్నారని డీసీపీ తెలిపారు.

విశాఖపట్నంలో సరోగసీ పేరుతో మోసం జరిగినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని హాస్పిటల్‌ను కేవలం కన్సల్టెన్సీ కోసం మాత్రమే వాడుకున్నారని, ఎఎఈ పేరుతో శాంపిల్స్ తీసుకొని మిగతా సరోగసీ ప్రాసెస్‌ను వైజాగ్‌లో నిర్వహించారని తెలిపారు.

ఒక కేసులో సృష్టి యాజమాన్యం బాధితులకు చనిపోయిన శిశువును చూపించిందని, మరో కేసులో రూ.15 లక్షలు అదనంగా డిమాండ్ చేసినట్లు తెలిపారు.సరోగసీ ద్వారా ఆడపిల్ల పుట్టిందనే వాదన అబద్ధమని డీఎన్ఏ పరీక్షలు నిర్ధారించాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పలువురు వైద్యుల ప్రమేయం ఉన్నట్లు ఆమె తెలిపారు. వైజాగ్‌కు చెందిన డా.విద్యులత, డా.రవి, డా.ఉషలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

అరెస్టైన వారిలో పలువురు మహిళలు ఉన్నారని, వీరిలో కొందరు అండాలు అమ్ముకున్నవారు, మరికొందరు సరోగసీ తల్లులుగా నటించినవారని డీసీపీ వివరించారు.

దంపతులు సరోగసీ కోసం సంప్రదించినప్పుడు, కొన్నిరోజుల తర్వాత ఫేక్ అల్ట్రాసౌండ్ రిపోర్టులు పంపించి, గర్భిణిని వెతికిపెట్టి, 9 నెలల తర్వాత వైజాగ్‌లో డెలివరీ జరిపి, ఆ శిశువును సరోగసీ పాపగా చెప్పి అప్పగించే మోసపూరిత పద్ధతి నడిచిందని ఆమె పేర్కొన్నారు.

## బంగారం దిగుమతులపై అదనపు సుంకాలు ఉండవు

### -అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

న్యూ ఢిల్లీ ఆగష్టు 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా భారత్ సహా ప్రపంచంలోని పలు దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు కారణంతో న్యూఢిల్లీపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చింది. ఆగస్టు 27 నుంచి మిగతా 25 శాతం టారిఫ్ అమలులోకి రానుంది. అయితే, ట్రంప్ నిర్ణయంతో దిగుమతి చేసుకునే బంగారు కడ్డీలపై సుంకాల పెంపు వర్తిస్తుందా? లేదా? అనే విషయంపై సందిగ్ధత నెలకొంది. దీనిపై అధ్యక్షుడు ట్రంప్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. 'బంగారం' లాంటి వార్త చెప్పారు. బంగారం దిగుమతులపై అదనపు సుంకాలు ఉండవని స్పష్టం చేశారు.ఒక కేజీతోపాటు 100 ఔన్సుల (2.8 కిలోల) బంగారు కడ్డీలు సుంకాల పరిధిలోకి వస్తాయని అమెరికా కస్టమ్స్ అధికార వర్గాలు ఇటీవలే పేర్కొన్న విషయం తెలిసిందే. ఈమేరకు జులై 31న ఓ ప్రకటన విడుదల చేశారు. అదే సమయంలో గోల్డ్ బార్‌లపై సుంకాల విధింపుపై ట్రంప్ క్లారిటీ ఇస్తూ త్వరలోనే ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేస్తారని వైట్‌హౌస్ అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ విషయంలో గందరగోళం నెలకొంది. ఇదే సమయంలో పసిడి ధరలు కూడా అమాంతం పెరిగాయి. దీంతో ట్రంప్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు బంగారంపై సుంకాలు విధించబోమంటూ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. 'బంగారంపై సుంకాలు ఉండవు' అని రాసుకొచ్చారు.

## ఖజానా జ్యువెలర్స్‌లో భారీ చోరీ..

హైదరాబాద్, ఆగష్టు 12:మహానగరంలో ఇవాళ(మంగళవారం) భారీ దోపిడీ జరిగింది. చందానగర్‌లోని ఖజానా జ్యువెలర్స్ షాపులో కొంతమంది దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఒక్కసారిగా దుకాణం లోపలికి ప్రవేశించిన దొంగలు తుపాకులతో బెదిరింపులకు దిగారు. అక్కడున్న సిబ్బంది బెదిరించి పెద్దఎత్తున నగలు ఎత్తుకెళ్లారు. వారిని అడ్డుకునేందుకు సిబ్బంది ప్రయత్నించగా.. కాల్పులకు తెగపడ్డారు.

షాపు డిప్యూటీ మేనేజర్ కాళ్లపై రెండు రౌండ్ల కాల్పులు జరిపారు దుండగులు. ఈ దాడిలో అతనికి తీవ్రగాయాలు అయ్యాయి. అనంతరం సీసీ కెమెరాలపైనా కాల్పులు జరిపారు. షాపు తెరిచిన 5 నిమిషాల్లోనే భారీ దోపిడీకి పాల్పడి అక్కడ్నుంచి హుడాయించారు కేటుగాళ్లు. షాపు సిబ్బంది, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అయితే, దోపిడీ అనంతరం దుండగులంతా జహీరాబాద్ వైపు పారిపోయినట్లు గుర్తించారు. ఈ మేరకు జిల్లా సరిహద్దు పోలీసులను అలర్ట్ చేశారు.

కాగా, నిందితులను పట్టుకునేందుకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ సీపీ వెల్లడించారు. కెపిహెచ్‌పిలో దోపిడీకి పాల్పడిన ముఠానే ఖజానా జ్యువెలర్స్‌లోనూ కాల్పులు జరిపి దొంగతనం చేసినట్లు తెలిపారు. కెపిహెచ్‌పిలో 20 తులాల బంగారం, రూ.3లక్షలను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా, ఖజానా జ్యువెలర్స్‌లో భారీగానే గోల్డ్ చోరీ అయినట్లు తెలుస్తోంది.

## మరో 3 నోటిఫికేషన్లు విడుదల చేసిన ఏపీపీఎస్సీ

అమరావతి, ఆగష్టు 12: ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ మరో 3 నోటిఫికేషన్లు విడుదల చేసింది. వ్యవసాయ శాఖలో 10 అగ్రికల్చర్ ఆఫీసర్ ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నెల 19 నుంచి సెప్టెంబర్ 8 వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది.

అటు, దేవాదాయ శాఖలో 7 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించింది. ఈ నెల 13 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

ఇక, భూగర్భజల శాఖలో 4 టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి కూడా ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నెల 13 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో జాబ్ నోటిఫికేషన్లను పొందుపరిచామని ఏపీపీఎస్సీ కార్యదర్శి పి. రాజాబాబు తెలిపారు.

## ఓపికతో ఎదురు చూస్తున్నా.. రాజగోపాల్ రెడ్డి

నల్గొండ, ఆగష్టు 12: మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే తనకు అన్యాయం జరిగినట్లేనని కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తనకు అన్యాయం జరిగితే ఫర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని.. గత ప్రభుత్వానికి చెప్పానని.. ఈ ప్రభుత్వానికీ చెబుతున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తానని మాట ఇచ్చిందని, మంత్రి పదవి ఇచ్చినప్పుడు ఇవ్వండి, కానీ.. అప్పటివరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా ఆపొద్దని కోరారు. తనకు మంత్రి పదవి ఇస్తామని చెప్పారని, అయితే సమీకరణాలు కుదరటం లేదని ఇప్పుడెందుకు అంటున్నారని ప్రశ్నించారు. తనకు మంత్రి పదవి ఇవ్వడం ఎందుకు కుదరటం లేదు.. ఆ సమీకరణలు రాకుండా ఎవరడ్డుకుంటున్నారు.. అని ప్రశ్నల వర్షం కురిపించారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.

ఇవాళ(మంగళవారం) మునుగోడు మండలం ఎలగలగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తనను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకునే సమయంలో మంత్రి పదవి ఇస్తానని తీసుకున్నారని గుర్తుచేశారు. అప్పుడు తాము ఇద్దరం అన్నదమ్ములం కాంగ్రెస్‌లోనే ఉన్నామని తెలియదా అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తానని రెండోసారి హామీ ఇచ్చారని.. అప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీలో తాము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని గుర్తులేదా అని ప్రశ్నించారు రాజగోపాల్ రెడ్డి.

ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా కొంతమంది నేతల పరిస్థితి ఉందని విమర్శించారు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు కదా? అని ప్రశ్నించారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండటం తప్పా అని నిలదీశారు. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమేనని, ఇద్దరం గట్టి వాళ్లమేనని.. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని ప్రశ్నల వర్షం కురిపించారు. మంత్రి పదవి ఇవ్వడానికి ఆలస్యమైనా సరే తాను ఓపిక పడుతానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రమాదాలు జరిగితే తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి: పి ప్రావిణ్య జిల్లా కలెక్టర్.

**-ప్రతి క్లస్టర్లో అధునాతన పరికరాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి.**
**-ప్రమాదం జరిగినప్పుడు ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు అన్ని చర్యలు వెంటనే చేపట్టాలి**
**-ప్రమాదం జరిగిన సమాచారం వెంటనే అన్ని శాఖల అధికారులకు అందించాలి.**

సంగారెడ్డి ఆగష్టు 12(నేటి నిజం ప్రతినిధి) అన్ని క్లస్టర్లలో ప్రమాదకరమైన రసాయనాలు, అగ్నిప్రమాదాలు, పేలుడు ప్రమాదాలు , విష వాయువులు ఉత్పత్తి, నిల్వ లేదా వినియోగం చేసే పరిశ్రమలను గుర్తించాలి.

హై రిస్క్ కర్మాగారాలలో ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశ్రమల యాజమాన్యానికి కార్మికులకు అవగాహన కల్పించాలి

సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పరిశ్రమలలో ప్రమాదం జరిగి స్థలాలు తనిఖీ చేయాలి

పరిశ్రమలలో ప్రమాదాలు జరిగితే తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలోని హైరిస్క్ కర్మాగారాలలో భద్రతా ప్రమాణాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై పరిశ్రమలు , కార్మిక శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఐల తో పాటు మిగిలిన క్లస్టర్లలో ఇక్కడ ప్రమాదం జరిగిన ఆయ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో తక్షణమే స్పందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో ఇటీవల జరిగిన సిగాచి పరిశ్రమ విషాదం తర్వాత పరిశ్రమల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో సిగాచి లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

అన్ని క్లస్టర్లలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రత్యేక బృందాలను 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలన్నారు ప్రమాదం జరిగిందన్న సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీవ్రతను తగ్గించడంతోపాటు అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టేలా వివిధ శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలోని హై రిస్క్ కర్మాకారాలు సందర్శించి అంచనా వేసే కమిటీ సభ్యులు ఆయా పరిశ్రమలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలు పరిశ్రమ యాజమాన్యం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పరిశ్రమలు సందర్శించిన సమయంలో పరిశ్రమల యాజ మాన్యం నుండి కార్మికుల పూర్తి వివరాలు సేకరించి ప్రమాదకర పరిస్థితులపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు పరిశ్రమలు ఉన్నాయా అవి పని చేస్తున్నాయా లేదా సరిచూసుకోవాలన్నారు అత్యవసర పరిస్థితులలో చేపట్టాల్సిన ప్రతిస్పందన చర్యలపై కార్మికులకు పరిశ్రమల యాజమాన్యానికి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు ప్రమాద నివారణలో భాగంగా సెల్ఫ్ కంప్లైయెన్స్ చెక్లిస్ట్ ను ప్రతి హైరిస్ గా పరిశ్రమలు తప్పనిసరిగా సిద్ధం చేసి చట్టబద్ధ పత్రంగా పరిగణించాలని కలెక్టర్ సూచించారు.

ఇందులో ప్లాంట్ లేఅవుట్లు అగ్నిమాపక డ్రాయర్లు నిల్వలో ఉన్న లేదా వినియోగించే రసాయనాల పూర్తి జాబితా ప్రదర్శించాలని కలెక్టర్ అధికారులకు పరిశ్రమల యజమాన్యాలకు వివిధ శాఖల అధికారులకు సూచించారు.

ప్రమాదాలు జరిగిన సమయంలో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లాలోని పరిశ్రమలను ప్రత్యేకంగా క్లస్టర్లుగా విభజించి విపత్తు సంసిద్ధత మరియు రక్షణ ప్రణాళికలు సిద్ధం చేయించినట్లు కలెక్టర్ తెలిపారు .

**భద్రత ప్రమాణాల లో రాజీలేదు:**

జిల్లాలోని పరిశ్రమలు అన్ని రకాల భద్రతా ప్రమాణాలు అమలు చేసే విధంగా ఆయా శాఖల అధికారులు రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు భద్రతా తనిఖీ ఒక వేధింపు చర్యకాకుండా కార్మికుల భవిష్యత్తు పరిశ్రమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన కార్యక్రమంలో చూడాలని అధికారులకు సూచించారు యజమాన్యాలు అనవసరంగా వేధించద్దని కలెక్టర్ సూచించారు చిన్నచిన్న పెట్టుబడులతో అంతర్నిర్మిత భద్రతా వ్యవస్థలను అభివృద్ధి చేస్తే ప్రామాణాస్తం తగ్గించవచ్చని ఆమె అన్నారు.

అన్ని పరిశ్రమలలో పేలుడు ఉపశమన పానెల్ లు భద్రత ఉపశమన వాల్వులు రియాక్టర్లకు పగిలిపోయే డిస్క్ వంటి లోపాలను వెంటనే సరి చేయాలని యజమాన్యాలను ఆదేశించారు .

**రెండు నెలల్లో తనిఖీ ప్రక్రియ పూర్తి:**

జిల్లా స్థాయి కమిటీలు వెంటనే షెడ్యూలు ప్రకారం తనిఖీలు ప్రారంభించి రెండు నెలలు మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెంటనే పరిష్కరించేలా పరిశ్రమల యాజమాన్యంతో సమన్వయం కొనసాగుతుందన్నారు. ఈ సెన్సిటైజేషన్ డ్రైవ్ కేవలం తనిఖీ మాత్రమే కాకుండా పరిశ్రమలో భద్రత సంస్కృతిని పెంపొందించడం లక్ష్యంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

**అన్ని పరిశ్రమలు సీసీటీవీలో తప్పనిసరి: ఎస్పీ పరతోష్ పంకజ్.**

జిల్లాలోని అన్ని పరిశ్రమలలో సీసీటీవీలో నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ పరతోష్ పంకజ్ పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు పరిశ్రమల భద్రతలో సిసి టీవీ నిగా కీలకమైన ప్రతి ముఖ్యమైన ప్రదేశంలో కేవలం సక్రమంగా పనిచేయాలన్నారు చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఫుటేజ్ లో నిల్వ చేయడం ద్వారా ప్రమాదా నివారణ దర్యాప్తులో ఇది సహాయపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ కె. గౌరీ శంకర్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, తెలంగాణ ఫ్యాక్టరీల డైరెక్టర్ , వై. మోహన్ బాబు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి తుల్జా నాయక్ ,సం బంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వెంకన్న లడ్డులో ఆధ్యాత్మిక శక్తి ..

హైదరాబాద్ ,ఆగష్టు 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స);: తిరుపతి వెంకన్న లడ్డు రుచికరమైన తీపి పదార్థమే కాదు ఆధ్యాత్మిక శక్తి నిగూఢమైన దైవ పదార్థంగా భావించవచ్చు. ప్రతిరోజు మూడున్నర లక్షల లడ్డూలు తయారు చేస్తారు . ముడి సరుకుల సేకరణ దగ్గర నుంచి తయారీ వరకు అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. అత్యంత నాణ్యత, రుచిగా ఉండే లడ్డు ప్రసాదాన్ని పన్నెండు గంటల ఉపవాసం తర్వాత తిని బ్లడ్ షుగర్ పరిశీలించినప్పుడు ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చాయని తెలిసింది. డ్రైఫ్రూట్స్, బెషన్, ఆవు నెయ్యి వాడకం కారణంగా ఆరోగ్య ప్రదాయినే అని తేలిందట. పురాతన దేవాలయాల వద్ద ప్రసాదాలు అందుకే మహిమాన్వితంగా ఉంటాయని భక్తులు చెబుతుంటారు. 322 సంవత్సరాల క్రితం 1715 ఆగష్టు రెండవ తేదీన శ్రీ వేంకటేశ్వర స్వామికి నైవేద్యంగా లడ్డూ ప్రసాదాన్ని ప్రవేశపెట్టారు.2009 లో ఈ లడ్డూకు పేటెంట్ హక్కులు కూడా సంక్రమించాయి.

## తిరుమల వెళ్లే భక్తులకు టీటీడీ బిగ్ అలర్ట్..
## పంద్రాగస్టు నుంచి ఆ వాహనాలకు నో ఎంట్రీ!

తిరుపతి, ఆగష్టు 12: టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై తిరుమలకు వచ్చే భక్తుల వాహనాలకు ఫాస్టాగ్‌ను తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆగష్టు 15వ తేదీ నుంచి ఈ కొత్త విధానాన్ని విధిగా అమలు చేస్తామని ప్రకటించింది.

అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వివిధ వాహనాల్లో చేరుకునే భక్తులకు మెరుగైన భద్రతా ప్రమాణాలు, అధిక రద్దీ నివారణ, పారదర్శక సేవలు అందించే దృష్ట్యా తిరుమలకు వెళ్లే వాహనాలకు ఫాస్టాగ్ తప్పనిసరి చేసినట్లుగా టీటీడీ వెల్లడించింది. ఇకపై ఫాస్టాగ్ లేని వాహనాలను కొండపైకి అనుమతించబోమని స్పష్టం చేసింది. ఫాస్టాగ్ లేని వాహనదారుల సౌకర్యార్థం అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఐసిఐసిఐ బ్యాంకు సహకారంతో ఫాస్టాగ్ జారీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఫాస్టాగ్ లేని వాహనదారులు ఇక్కడ తక్కువ సమయంలోనే ఫాస్టాగ్ సౌకర్యాన్ని పొందిన తర్వాత మాత్రమే వారి వాహనాలను తిరుమలకు అనుమతిస్తారని స్పష్టం చేసింది. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని టీటీడీకి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## భారీ వర్ష సూచన.. అలర్ట్ అయిన అధికారులు



హైదరాబాద్, ఆగష్టు 12:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్, అరెంజ్ అలర్టులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే మరోసారి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ మేరకు ప్రజలందరూ.. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే ఛాన్స్ ఉందని ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని పేర్కొంది. వర్షం పడే సమయంలో చెట్ల కింద కూడా ఉండకూడదని హెచ్చరిస్తుంది. ప్రయాణాలు మానుకోవాలని, లేని పక్షంలో వాయిదా వేసుకోవాలని తెలుపుతుంది.

భారీ వర్షాల కారణంగా రోడ్లు, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్లు జలమయం అవుతున్నాయి. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తూ.. చర్యలు చేపడుతుంది. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ.. అధికారులను ప్రజలతో సమన్వయం అయ్యేలా.. చూస్తుంది.

అయితే.. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా ప్రజలు వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని తెలుపుతున్నారు. పొలాల దగ్గరకు వెళ్లాల్సిన రైతుల కూడా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజల దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ 7981975495 కు ఫోన్ చేయాలని అధికారులు వెల్లడించారు.

## ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత హఠాన్మరణం



హైదరాబాద్, ఆగష్టు 12: ప్రముఖ రచయిత్రి, కవయిత్రి అనిశెట్టి రజిత ఇక లేరు. హనుమకొండ గోపాల్‌పూర్‌లోని అద్దె ఇంటిలో సోమవారం రాత్రి గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం రాత్రి ఒక పుస్తకావిష్కరణ సభలో పాల్గొని చలాకీగా ఉన్న ఆమె ఆకస్మాత్తుగా అస్తమయం కావడంతో ఓరుగల్లు సాహితీలోకం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. వరంగల్‌లోని అనేక సాహితీ సంస్థలతో ఆమె సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. సామాజిక అంశాలే ఇతివృత్తం గా ఆమె రాసిన పుస్తకాలు దేశవ్యాప్తం గా పుస్తక రచనతో పాటు సామాజిక సేవకు అంకితమయ్యారు. తొలి రచన **'చైతన్యం పడగెత్తింది'**తో కవయిత్రిగా ఆమె సాహితీ ప్రస్థానం మొదలైంది. అలా 500 కవితలు, 100 వ్యాసాలు, 30కి పైగా కవితలు, 30 పాటలు రాసి పాడారు.

అంతేగాక ప్రజాస్వామిక రచయిత్రుల సంఘం ఏర్పాటు చేసి మహిళలకు సంబంధించి అంశాలపై అనేక రచనలు చేశారు. పీడిత ప్రజలను చైతన్యం చేసేందుకు సామాజిక స్పృహ కలిగించే పుస్తకాలు రాసి ఇతర రాష్ట్రాల్లోనూ ప్రచారం చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, తొలి, మలి ఉద్యమంలో కూడా తనదైన ముద్ర వేశారు. నెల రోజుల క్రితం విశాఖపట్టణంలో ప్రజా సేవకురాలు సీతారామలక్ష్మి మృతి చెందితే అక్కడే వుండి ప్రత్యేక సంచిక రాసి వచ్చారు. కాగా అనిశెట్టి రజిత మృతి పట్ల శ్రీలేఖ సాహితీ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ టీ. శ్రీరంగ స్వామి లండన్ నుంచి సంతాపం ప్రకటించారు. నేత్ర, శరీరదానంపై పలు ప్రాంతాల్లో ప్రచారం చేయడమే గాక తాను చనిపోయిన తర్వాత శరీరాన్ని కాల్చి వృధా చేయడం కాదు. వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలంటూ పలువురు సాహితీవేత్తల ముందు చెబుతూ గతేడాది కేఎంసీ ప్రిన్సిపాల్‌కు అంగీకార పత్రం రాసిచ్చారు. సోమ వారం రాత్రి నేత్రవైద్యశాల సిబ్బంది ఆమె నేత్రాలను తీసుకెళ్లారు. కవయిత్రిగా ఎంతో పేరు ఉన్న రజితకు చివరి ఘడియల్లో కష్టాలు తప్పలేదు. ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రాక పోవడంతో సాహితీవేత్తలు రెండు, మూడు గంటల పాటు ఇక్కట్లకు గుర య్యారు. అద్దె ఇంటి వారు ఒప్పుకోక పోవడం, బంధువులు నికారించడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చివరకు రిటైర్డు ప్రొఫెసర్, కవయిత్రి కాత్యాయని విద్మహే తన ఇంటి ముందు తీసుకురావడానికి అంగీకరించడంతో రాత్రి 10 గంటల దాటిన తర్వాత కాకతీయ యూనివర్సిటీ ఫస్టు గేటు వద్ద ఉన్న కాత్యాయినీ ఇంటి వరదకు తరలించారు. ఈ రోజు సాహితీవేత్తల సమక్షంలో అనిశెట్టి రజిత పార్థీవ దేహాన్ని కేఎంసి ఆసుపత్రికి అందజేశారు.

## ఉట్టి కొట్టడం ప్రాక్టీస్ చేస్తూ ప్రమాదవశాత్తు బాలుడు మృతి..!

న్యూఢిల్లీ, ఆగష్టు 12:ఈ నెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పెరుగు కుండను పగులగొడుతారు. శ్రీకృష్ణుడు పెరుగు, వెన్నలను దొంగిలించి తినేవాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు పెరుగు కుండను పగులగొట్టడం అనేది ఆచారంగా కొనసాగుతోంది. పెరుగు కుండను పగులగొట్టే ఉత్సవాన్నే తెలుగు రాష్ట్రాల్లో ఉట్టి కొట్టడం అంటారు.

మహారాష్ట్ర సహా కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో 'దహీ హండీ' పేరుతో జరుపుకుంటారు. ఈ ఉట్టి కొట్టడం అనేది కూడా కొన్ని చోట్ల ఘనంగా జరుగుతుంది.

శిక్షణ పొందిన బృందాలు మానవ పిరమిడ్‌గా ఏర్పడి ఉట్టి కొడుతాయి. అందుకోసం కొన్ని రోజుల ముందు నుంచే ప్రాక్టీస్ చేస్తారు. ఇలా ప్రాక్టీస్ చేసే క్రమంలోనే మహారాష్ట్ర రాజధాని ముంబైలోని దహిసర్ ఏరియాలో మహేశ్ జాదవ్ అనే 11 ఏళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

ప్రాక్టీస్ చేస్తుండగా జారిపడ్డ జాదవ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు ప్రాణాలు విడిచాడు. ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ప్రాక్టీస్ చేయడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఘటనపై ప్రమాదవశాత్తు మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

## పాక్ ఆర్మీ చీఫ్‌కు ట్రంప్ బిగ్ గిఫ్ట్..

### -బలూచ్ ఆర్మీని అంతర్జాతీయ ఉగ్రసంస్థగా గుర్తించిన అమెరికా

న్యూ ఢిల్లీ ఆగష్టు 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )ల;పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ పర్యటన వేళ అగ్రరాజ్యం అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌లో ప్రత్యేక దేశం కోసం పోరాడుతూ అక్కడి సైన్యానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దానికి చెందిన మజీద్ బ్రిగేడ్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా గుర్తించింది. బీఎల్ఏని 2019లోనే.. 'స్పెషల్లీ డెజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డీజీటీ)' జాబితాలో చేర్చిన అమెరికా.. తాజాగా మజీద్ బ్రిగేడ్‌ను కూడా బీఎల్ఏలో భాగంగానే భావిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక ప్రకటన చేశారు.ఇటీవలే కాలంలో బీఎల్ఏకు చెందిన మజీద్ బ్రిగేడ్ పాక్‌లోని పలు ప్రాంతాల్లో వరుస దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. పాక్ సైన్యమే లక్ష్యంగా ఆత్మాహుతి దాడులు నిర్వహిస్తోంది. 2024లో కరాచీ ఎయిర్‌పోర్ట్, గ్వాదర్ పోర్ట్ అథారిటీపై బీఎల్ఏ దాడులు చేపట్టింది. ఇక ఈ ఏడాది అంటే 2025లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ చేసి దాదాపు 300 మంది ప్యాసింజర్లను బందీలుగా చేసుకుంది. పాక్ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి వారిని విడిపించింది. ఈ రైలు హైజాక్ ఘటనలో 31 మంది పౌరులు, పాక్ సైనికులు చనిపోయారు. ఇలా వరుస దాడులతో బలూచ్ ఆర్మీని ఉగ్రసంస్థగా గుర్తించాలని పాక్ కోరుతూ వస్తోంది.అయితే, ప్రస్తుతం అధిక టారిఫ్‌ల నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో పాక్‌తో అగ్రరాజ్యం బంధం బలపడుతోంది. ఇప్పటికే దాయాదితో వ్యాపారం చేసేందుకు అమెరికా ఒప్పందం కూడా చేసుకుంది. ఇదే సమయంలో పాక్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ సైతం రెండు నెలల్లో రెండోసారి యూఎస్ పర్యటనకు వెళ్లారు. ఆయన పర్యటన కొనసాగుతున్న వేళ అమెరికా నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీని అంతర్జాతీయ ఉగ్రసంస్థగా గుర్తించి మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెద్ద గిఫ్ట్ ఇచ్చారంటూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది.

# మామూలు మహిళ నుంచి మహారాణి వరకు ఎదిగిన అహల్యాబాయి హోల్కర్

## (13 ఆగస్టు "అహల్యాబాయి హోల్కర్ 300వ వర్ధంతి" సందర్భంగా)

ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న అహల్యానగర్ జిల్లాకు చెందిన చోండీ గ్రామంలో పాటిల్ లేదా చీఫ్ అయిన సుశీల – మంకోజి షిండే దంపతులకు 31 మే 1725న జన్మించింది అహల్యాబాయి. నాటి కాలంలో బాలికలు పాఠశాలకు వెళ్లే వారు కానప్పటికీ తల్లితండ్రుల చొరవతో చదవడం, రాయడం నేర్చుకుంది. నిరాడంబర కుటుంబంలోంచి ఎదిగిన 8 ఏండ్ల అహల్యాబాయి ఆలయ సేవలను, భక్తిని, ప్రవర్తనను గమనించిన మాల్వా ప్రాంత సైనిక కమాండర్ మల్హర్ రావు వెంటనే తన 10 ఏండ్ల కుమారుడు ఖండేరావుకు తగిన వధువుగా ఎంపిక చేసుకొని వివాహం జరిపించారు. 1745లో ఆ యువ జంటకు మలే రావు అనే కుమారుడు, 1748లో ముక్తాబాయి అనే కూతురు జన్మించారు.

### మహారాణిగా ఎదిగిన క్రమం:

1754లో కుంబేర్ ముట్టడి సమయంలో జరిగిన ఫిరంగుల కాల్పుల్లో ఖండేరావు మరణించగా నాటి ఆచారం ప్రకారం సతీ సజీవ దమనం చేసుకోవడానికి సిద్ధపడిన అహల్యాబాయిని మామ గారైన మల్హర్‌రావు ఒప్పించి తన కోడలిని కాపాడారు. విధవరాలైన అహల్యాబాయికి రాజ నీతి, రాజ్య పాలన, యుద్ధ నైపుణ్యాలు, ప్రజా సంక్షేమాల్లో శిక్షణ ఇవ్వడంతో ఆమె రాజ్య వ్యవహారాలను చక్కగా చూసుకోవడం జరిగింది. 1766లో మామ గారైన మల్హర్ రావు మరణించడంతో తన కుమారుడు మలేరావు రాజ్య బాధ్యతలను తీసుకోవడం, మానసిక అనారోగ్యంతో తన కుమారుడు మరణించడంతో దెబ్బ మీద దెబ్బ పడినట్లు అహల్యాబాయిని సమస్యలు వెంటాడాయి. నాడు స్త్రీలను రాజ్య పాలనకు అనర్హులుగా పరిగణించాడే వారు. కాని అహల్యాబాయి శక్తి, యుక్తి, పాలనా పటిమ, ప్రవృత్తి లాంటి పలు సామర్థ్యాన్ని గుర్తించిన నాటి మరాఠా ముఖ్యులు ఆమె సింహాసనం స్వీకరించడానికి అంగీకారించడం విశేషం.

### మహారాణిగా అహల్యాబాయి హోల్కర్ :

అహల్యాబాయి మహారాణిగా పదవి చేపట్టిన తర్వాత తన సైన్యాన్ని ఆధునీకరిస్తూ బలోపేతం చేయడం, దౌత్య సంబంధాలను పటిష్ట పరచడం, పరిపాలనలో తనదైన ముద్రను చూపడంతో పాటు నిర్మాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చేది. ఆమె సమర్థవంతమైన పాలనలో ప్రజలు శాంతి, స్థిరత్వం, పురోగతి, ఆధ్యాత్మిక వికాసం లాంటి అంశాలను రుచి చూడగలిగారు. ప్రజలతో మమేకం అవుతూ వారి యోగక్షేమాలు చూసుకుంటూ రామరాజ్య స్థాపన చేసిన అహల్యాబాయి మహారాణి నాటి ప్రజల ఆరాధ్య దైవంగా మారిపోయారు. నాడు మహిళలు పాటించే పర్దా లేదా స్త్రీల ఏకాంతవాసం ఆచారాన్ని పాటించకుండా ప్రజలతో నేరుగా ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉండేది. వివాదాల పరిష్కారం కోసం కోర్టులను కూడా స్థాపించడం అహల్యాబాయి మహారాణికి మాత్రమే ప్రత్యేకం. యుద్ధ భూమిలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఒక సామాన్య వ్యక్తికి తన కూతురును ఇచ్చి వివాహం జరిపించడం అహల్యాబాయి దార్శనికతకే నిదర్శనం.

### అనేక దేవాలయాల పునరుద్ధరణ:

మహారాణిగా అహల్యాబాయి అనేక కోటలు, రోడ్లు, బావులు, ధర్మశాలలు, హిందూ దేవాలయాలు, విశ్రాంతి గృహాలను నిర్మించడంతో పాటు నర్మదా నది ఒడ్డున తన రాజధానిగా మహేశ్వర్(శివుని నివాసం, నేటి మధ్యప్రదేశ్‌లో)ను నిర్ణయించింది. అనేక మంది కళాకారులు, శిల్పులకు ఉపాధి కల్పించడమే కాకుండా వారణాసి, ఘృష్ణేశ్వర్, త్రయంబక్, గయా, పుష్కర్, ద్వారక, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్, మథుర, శ్రీశైలం, బృందావన్, నాథద్వారా, బద్రీనాథ్, కేదార్నాథ్ లాంటి పలు ఆలయాలను పునర్నిర్మించడం జరిగింది. శివుడికి నివాళిగా దేశవ్యాప్తంగా జ్యోతిర్లింగాలను పునరుత్థానం చేసింది. మొగుల్ చక్రవర్తి ఔరంగాజేబు కాశీ ఆలయాన్ని నాశనం చేసిన శతాబ్దం తర్వాత, ఆమె 1780లో కాశీ ఆలయాన్ని పునర్నిర్మించింది. మహేశ్వర్‌లో వస్త్ర పరిశ్రమను సహితం స్థాపించడం జరిగింది. 13 ఆగస్టు 1795న అహల్యాబాయి హోల్కర్ మహారాణి మరణించడంతో మల్హర్ రావు దత్తపుత్రుడు తుకోజీ రావు సింహాసనం అధిష్టించిన రెండు ఏండ్ల తర్వాత తన కుమారుడు జస్వంత్ రావుకు సింహాసనం వదులుకున్నారు. 1804లో బ్రిటీష్ వారితో యుద్ధంలో ఓడిపోయిన చివరి హోల్కర్ పాలకుడిగా మిగిలి పోయారు.

మహారాణి అహల్యాబాయి హోల్కర్ బహుముఖ ప్రజ్ఞకు గుర్తుగా ఇండోర్ విమానాశ్రయానికి అహల్యాబాయి హోల్కర్ విమానాశ్రయంగా, ఇండోర్‌లోని విశ్వవిద్యాలయానికి దేవి అహల్యాబాయి యూనివర్సిటీగా, సోలాపూర్‌లోని విశ్వవిద్యాలయానికి పుణ్యశ్లోక్ అహల్యాదేవి హోల్కర్ యూనివర్సిటీగా పేరు పెట్టడం జరిగింది. పాలనలో దాతృత్వం, సామాజిక సంస్కరణలు, కళలు, సంస్కృతికి మద్దతుగా నిలిచిన అహల్యాబాయి నేటి ఇండోర్ నగర అభివృద్ధికి నాడే పటిష్ట బీజాలు నాటారు. వితంతువులకు ఆస్తి హక్కు, మహిళా సాధికారతలకు పెద్ద పీట వేశారు. రాజమాత అహల్యాదేవి హేల్కర్‌గా ప్రసిద్ధి గాంచి భారత స్వాతంత్ర్యానికి ముందు అత్యంత శక్తివంతమైన మహిళగా రుజువు చేసుకున్నారు. తత్వవేత్తగా, మహారాణిగా, సమర్థురాలైన పాలకురాలిగా కీర్తించబడిన అహల్యాబాయి భక్తురాలిగా, ధైర్యం కలిగిన నాయకురాలిగా కీర్తించబడ్డారు.

ఆమె విలక్షణ సుపరిపాలన, సామాజిక సంస్కరణలు, సైనిక విజయాలను విస్మరించిన నాటి పాలకులు చరిత్ర పుస్తకాల్లో అహల్యాబాయి హోల్కర్ ప్రస్తావనలకు చాలా తక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అహల్యాబాయి 300వ వర్ధంతి సందర్భంగా నేటి యువత, ముఖ్యంగా యువతులు ఆమె జీవిత చరిత్రను ఆకళింపు చేసుకొని ఆమె చూపిన బాటలో పయనించాలని కోరుకుందాం.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# సుస్థిర మైనింగ్ పద్ధతులు, పర్యావరణ నిర్వహణ

న్యూఢిల్లీ, ఆగష్టు 12:సుస్థిర మైనింగ్ పద్ధతులను ప్రోత్సహించేందుకు బొగ్గు మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్), ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్), సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) తదితర బొగ్గు, లిగ్నైట్ ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లు సుస్థిర మైనింగ్ పద్ధతులను అనుసరిస్తున్నాయి. వీటిలో భూగర్భ, భూ ఉపరితల గనుల కోసం మైనర్, ఎక్సెంట్రిక్ రిప్పర్లు, కంటిన్యుయస్ మైనర్, హై వాల్ మైనింగ్ తదితర అధునాతన సాంకేతికతలు ఉన్నాయి. అదనంగా, రోడ్డు రవాణాను తగ్గించడానికి ఫస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రాజెక్టులు, వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి నీటి స్ప్రింక్లర్లు, ఫాగ్ కెనాన్లు, దుమ్మును నియంత్రించడానికి వెట్ డ్రిల్లింగ్, డస్ట్ ఎక్స్‌ట్రాక్టర్లు బిగించిన డ్రిల్స్ ఉపయోగిస్తున్నారు.

ఆమోదించిన మైనింగ్, పర్యావరణ నిర్వహణ ప్రణాళిక ప్రకారం జీవ పునరుద్ధరణ, అటవీకరణ కార్యక్రమాలను సైతం పీఎస్‌యూలు చేపడుతున్నాయి. మైనింగ్ పూర్తయిన ప్రాంతాలు, ఓవర్ బర్డెన్ (ఓబీ) డంపులు, మైనింగ్ పరిసర ప్రాంతాల్లోని ఇతర భూములను క్రమంగా స్వాధీనం చేసుకొని అడవులను పెంచుతున్నారు. బహుళ అంచెల్లో మొక్కలు పెంచడం, విత్తన బంతులు, విత్తనాలు వెదజల్లడానికి డ్రోన్లను ఉపయోగించడం లాంటి వినూత్న విధానాలతో సహా శాస్త్రీయమైన పద్ధతులను పీఎస్‌యూలు అమలు చేస్తున్నాయి. మైనింగ్ చేపట్టిన పరిసర ప్రాంతాల్లో లక్షల కొద్దీ మొక్కలను నాటడం ద్వారా 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు సుమారుగా 13,400 హెక్టార్ల భూమిని ఈ పీఎస్‌యూలు అటవీకరణ చేశాయి.

బొగ్గు సంస్థల్లో అధునాతన సుస్థిర సాంకేతికతలను అనుసరించడమనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ. 2025–26 ఆర్థిక సంవత్సరానికి, ఉపరితల గనుల నుంచి 537.92 మిలియన్ టన్నుల బొగ్గును, పేలుడు రహిత మైనింగ్ సాంకేతికతలను ఉపయోగించి భూగర్భ గనుల నుంచి 23.63 మిలియన్ టన్నుల బొగ్గును సేకరించాలని సీఐఎల్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. అదనంగా, అదే ఏడాదికి బొగ్గు, లిగ్నైట్ మైనింగ్ ప్రాంతాల్లో 2,800 హెక్టార్లలో మొక్కలు నాటాలని కోల్, లిగ్నైట్ పీఎస్‌యూలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

# ప్రధాని మోదీ రాజీనామా చేయాలి : మానాల మోహన్ రెడ్డి



న్యూఢిల్లీ, ఆగష్టు 12: దేశంలో ఎలక్షన్ కమిషన్‌ను అడ్డుపెట్టుకొని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాడని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణుతో కలిసి జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీ దిష్టి బొమ్మ దహనం చేశారు. మోదీ దిష్టి బొమ్మ దహనం చేసే కార్యక్రమంలో పోలీసులు, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప ఉద్రిక్తత ఏర్పడగా కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలిపారు.

ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో మోదీ ఎలక్షన్ కమిషన్‌ను తన గుప్పిట్లో పెట్టుకొని దొంగ ఓట్లు సృష్టించి అధికారంలోకి వచ్చాడన్నారు. రాహుల్ గాంధీ ఓట్లలో దొంగతనం జరిగిందని బయటపెట్టగానే ఎలక్షన్ కమిషన్ తన అధికారి వెబ్ సైట్ను బ్యాన్ చేసిందని, ఒకవేళ ఎలక్షన్ కమిషన్ తప్పు చేయకుంటే ఎందుకు వెబ్‌సైట్‌ను బ్యాన్ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ 10 సంవత్సరాలుగా ఓట్ల నమోదు ప్రక్రియలో తప్పు జరుగుతుందని పదేపదే చెప్తున్న విషయం నేడు వెలుగులోకి వచ్చిందని, ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని అన్నారు.దేశంలో నిజాయితీ గల నాయకుడు కేవలం రాహుల్ గాంధీ అని ఎల్లప్పుడు ప్రజల కోసం ఆలోచించే వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ మెంబర్ రామకృష్ణ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి ,వివిధ ఆలయాల చైర్మన్ లు లవంగ ప్రమోద్, మధు సుదన్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ, వినయ్, సంగెం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీ చిక్కిన మండల సర్వేయర్

కరీంనగర్, ఆగష్టు 12:పెద్దపల్లి జిల్లాలో మరో అవినీతి చేపను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పెద్దపల్లికి చెందిన ఓ రైతు నుంచి భూమి సర్వే చేసిన రిపోర్టు ఇవ్వడానికి సర్వేయర్ లంచం డిమాండ్ చేశాడు. అందుకు సదరు రైతు కొంత మొత్తం ఇచ్చేందుకు చేసుకున్న ఒప్పందంలో భాగంగా పదివేల రూపాయలు ప్రైవేట్ సర్వేయర్ ఎస్ రాజేందర్ రెడ్డి ద్వారా మండల సర్వేయర్ అకౌంటఖరే బదిలీ చేయగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.

ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సర్వేయర్ పెండ్యాల సునీల్ ఫోన్ పే ద్వారా రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా బుధవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు విచారణ చేపడుతున్నారు. నాగార్జున రెడ్డి అనే రైతు భూమి సర్వే చేసి పంచానమా ఇవ్వడానికి 10 వేలు సర్వేయర్ సునీల్ డిమాండ్ చేయగా సదరు రైతు ఏసీబీ అధికారులను సంప్రదించారు.

ఏసీబీ అధికారుల సూచనల మేరకు సర్వేయర్ సునీల్ అకౌంట్ ఫోన్ పే ద్వారా 10000 రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేయడంతో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ సునీల్ తో పాటు ప్రైవేటు సర్వేయర్ రాజేందర్ రెడ్డిలను విచారించిన అనంతరం ఏసీబి కోర్టుకు తరలించనున్నట్లు కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు.

# మధ్యప్రదేశ్, అసోం, అరుణాచల్ ప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాల్లో సొంత, వాణిజ్య బొగ్గు బ్లాకులపై బొగ్గు మంత్రిత్వ శాఖ సమీక్ష

న్యూఢిల్లీ, ఆగష్టు 12:మధ్యప్రదేశ్, అసోం, అరుణాచల్ ప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాల్లో కేటాయించిన సొంత, వాణిజ్యపరమైన బొగ్గు బ్లాకుల స్థితి, వాటిలో పురోగతిని అంచనా వేయడం కోసం.. అదనపు కార్యదర్శి, నామినేటెడ్ అథారిటీ (ఏఎస్ ఉ ఎన్ఏ) శ్రీమతి రూపీందర్ బ్రార్ అధ్యక్షతన బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ రోజు సమగ్ర సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. బొగ్గు బ్లాకుల కేటాయింపుదారులు, కేంద్ర ప్రభుత్వ, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బొగ్గు బ్లాకుల నిర్వహణలో విజయాలు, సవాళ్ల పరిష్కారంపై సమీక్షించడంతోపాటు ఈ రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తిని పెంచే చర్యలపై చర్చించారు.

సమీక్ష సమావేశం సందర్భంగా మొత్తం 39 బొగ్గు బ్లాకులకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. వాటిలో మధ్యప్రదేశ్‌లో 33, అసోంలో 2, అరుణాచల్ ప్రదేశ్‌లో 1, తెలంగాణలో 1, గుజరాత్‌లో 2 ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో క్యాప్టివ్, వాణిజ్యపరమైన బొగ్గు గనుల పనితీరు స్థిరమైన పురోగతిని కనబరిచింది. మధ్యప్రదేశ్‌లో 13 బొగ్గు బ్లాకుల్లో కార్యకలాపాలు జరుగుతుండగా, వాటిలో 9 బొగ్గును ఉత్పత్తి చేస్తున్నాయి. తెలంగాణలో 1 బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తి జరుగుతోంది. ఉత్పత్తి చేసే ఈ బ్లాకులన్నీ కలిసి 2024–25లో 34.80 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని నమోదు చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26లో (2025 జూలై 31 వరకు) ఇప్పటికే 10.80 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగింది.దేశీయ బొగ్గు సరఫరాను మరింత బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం, దేశంలో పెరుగుతున్న ఇంధన డిమాండ్లను తీర్చడం కోసం ఈ రాష్ట్రాల్లో మిగిలిన 25 బొగ్గు బ్లాకుల్లో కార్యకలాపాలను వేగవంతం చేయాల్సిన ఆవశ్యకతపైనా ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు.సొంత, వాణిజ్యపరమైన బొగ్గు తవ్వకాలను ముందుకు తీసుకెళ్లడంపై నిబద్ధతను మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది. అంతరాయం లేకుండా బొగ్గు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలో అవరోధాలను పరిష్కరించడం, వనరుల సమర్థమైన వినియోగాన్ని ప్రోత్సహించడం ఆవశ్యకతను చర్చించారు. బొగ్గు రంగంలోని ఆస్తుల సామర్థ్యాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడం, ఈ రంగాలలో నిరంతరం వృద్ధిని పెంచడం, ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి దోహదపడడం కోసం.. సంబంధిత భాగస్వాములందరితో బొగ్గు మంత్రిత్వ శాఖ సన్నిహితంగా పనిచేస్తోంది.

# టీటీడీకి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు భారీ విరాళం అందజేత



తిరుపతి, ఆగష్టు 12: హైదరాబాద్‌కు చెందిన కాప్టన్ సర్వీసెస్ సంస్థ అధినేత కొడాలి శ్రీకాంత్ మంగళవారం టీటీడీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ. కోటి, వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం చెక్కులను అందజేశారు.

టీటీడీకి రెండు బ్యాటరీ బగ్గీలు విరాళం

బెంగుళూరుకు చెందిన మరో భక్తుడు చంద్ర శేఖర్ మంగళవారం టీటీడీకి రూ.11 లక్షలు విలువైన రెండు బ్యాటరీ బగ్గీ వాహనాలను విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయం ముందు వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి డిప్యూటీ ఈవో లోకనాథంకు వాహన తాళాలు అందజేశారు.

# నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు




ఖమ్మం, ఆగష్టు 12:ప్రభుత్వ విద్య పరిరక్షణకై, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ సహాయ కార్యదర్శి షేక్ చాంద్ పాషా పిలుపునిచ్చారు. జూలూరుపాడు మండల కేంద్రంలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు షేక్ చాంద్ పాషా ఏఐఎస్ఎఫ్ శ్వేత ముఖ్య అతిథులుగా హాజరై అరుణ పతాకాన్ని ఎగురవేశారు.

అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆవిర్భావ సమావేశంలో షేక్ చాంద్ పాషా మాట్లాడారు. 90 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐఎస్ఎఫ్ ఉద్యమ స్ఫూర్తితో నేటి పాలకులు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, ప్రభుత్వ విద్య పరిరక్షణకై, అసమానతలతో కూడిన నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ వేడుకలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు పవన్, సాయి ధనుష్, రామ్ చరణ్, నవీన్, శివ పాల్గొన్నారు.

# రైతులకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వ విధానాలపై ఒక వ్యాసాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 12:రైతుల ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యలను వివరిస్తూ రాజ్యసభ ఎంపీ శ్రీ సత్‌నాం సింగ్ సంధూ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రజలతో పంచుకున్నారు. పంట బీమా, భూసార సూచక కార్డులు, ఆర్థికసాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం వంటి నిర్ణయాలు వారి జీవనోపాధిని ఏ విధంగా బలపరిచి, ఫలసాయాన్ని పెంచడంతో పాటు దేశ వ్యవసాయ రంగాన్ని దృఢమైందిగా మార్చివేశాయో ఈ వ్యాసం వివరించింది.

"శ్రీ సత్‌నాం సింగ్ సంధూ గారి వ్యాసం అనేక ముఖ్య విషయాలను వివరించింది.. పంట బీమా, భూసార సూచక కార్డులు, ఆర్థిక సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం వంటి నిర్ణయాలను తీసుకొంటూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఏ విధంగా పెద్దపీట వేసిందీ, ఈ చర్యలు రైతుల జీవనోపాధిని బలపరిచి, దిగుబడులను పెంచుతూ, మన దేశ వ్యవసాయ రంగాన్ని ఆటుపోట్లకు తట్టుకొనే స్థితికి ఎలా చేర్చిందీ... ఆయన తన వ్యాసంలో తెలిపారు."

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని మృతి

న్యూఢిల్లీ, ఆగష్టు 12: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ నగరానికి చెందిన ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. విద్యార్థినిని గండిమైసమ్మ ప్రాంతంలోని బాలాజీ నగర్‌కు చెందిన శ్రీను వర్మ కుమార్తె శ్రీజ వర్మ (23)గా గుర్తించారు.

శ్రీజ ఉన్నత చదువుల కోసం కొంతకాలం క్రితమే అమెరికాకు వెళ్లింది. అక్కడ చికాగో లో నివసిస్తోంది. సోమవారం రాత్రి తాను ఉంటున్న అపార్ట్‌మెంట్ నుంచి దగ్గర్లోని రెస్టారెంట్‌కు డిన్నర్ చేసేందుకు నడుచుకుంటూ వెళ్లింది. ఈ క్రమంలో ఓ ట్రక్కు శ్రీజను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీజ.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

కాగా, సిద్దిపేట జిల్లాకు చెందిన శ్రీను వర్మ ఫ్యామిలి కొంతకాలం కిందటే హైదరాబాద్‌కు షిఫ్ట్ అయినట్లు తెలిసింది. శ్రీను వర్మ డ్రైవర్‌గా పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. పై చదువులకని వెళ్లిన తన కుమార్తె ఇలా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. కాగా, శ్రీను వర్మ చిన్న కుమార్తె శ్రేయా వర్మ సైతం ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లినట్లు బంధువులు తెలిపారు.

# నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవాలి : తహసీల్దార్ గంగాధర్

నిజామాబాద్, ఆగష్టు 12:జాతీయ కుటుంబ సంక్షేమ పథకం నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ఈ పథకం కింద ప్రభుత్వం నుండి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు.

కుటుంబాన్ని పోషించే వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే ఆ కుటుంబానికి జాతీయ కుటుంబ సంక్షేమ పథకం ఎన్.ఎఫ్.బీ.ఎస్ వర్తిస్తుందని తెలిపారు. అర్హులైన వారు మీ–సేవ ద్వారా దరఖాస్తు చేసుకొని తహసీల్దార్ కార్యాలయంలో పత్రాలు అందజేయాలని తెలిపారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ పథకం ద్వారా 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల వారై ఉండి కుటుంబాన్ని పోషిస్తున్న వారు మరణిస్తే రూ.20 వేల రూ.సహాయం అందుతుందన్నారు.

# ఈ ఏడాది శ్రీ అమర్‌నాథ్ గుడిని దర్శించుకున్న 4.14 లక్షల మందికి పైగా భక్తులు..

న్యూఢిల్లీ, ఆగష్టు 12:శ్రీ అమర్‌నాథ్ యాత్ర సురక్షితంగా, ఇబ్బంది లేకుండా ముగించేలా సేవలను అందించినందుకు భద్రతా దళాలకూ, శ్రీ అమర్‌నాథ్ దేవస్థాన కార్యనిర్వహణ మండలికీ, జమ్మూకాశ్మీర్ పాలన యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలకూ కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అభినందనలు తెలిపారు.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శ్రీ అమిత్ షా స్పందిస్తూ... బాబా బర్ఫానీ దర్శనం కోసం ఈ సంవత్సరం 4.14 లక్షల మందికి పైగా భక్తజనం శ్రీ అమర్‌నాథ్‌జీ సన్నిధికి వచ్చారన్నారు. బాబాను దర్శించుకోవడం నిరంతరంగా కొనసాగుతూ వస్తున్న సంప్రదాయమనీ, భారతీయ సంస్కృతి పట్ల విశ్వాసానికి ఇది ఒక ప్రతీక అనీ శ్రీ అమిత్ షా అభివర్ణించారు. ఈ యాత్రను సురక్షితంగా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ముగిసేలా సేవలను అందించిన భద్రతా దళాలను, శ్రీ అమర్‌నాథ్‌జీ దేవస్థాన కార్యనిర్వహణ మండలినీ, జమ్మూకాశ్మీర్ పాలన యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలనూ అభినందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ పవిత్ర యాత్రను విజయవంతంగా ముగించడానికి మీరంతా అందించిన తోడ్పాటు ప్రశంసనీయం, అద్వితీయమని శ్రీ అమిత్ షా అన్నారు. బాబా బర్ఫానీ ఆశీర్వాదాలు అందరికీ దక్కాలని మంత్రి ఆకాంక్షించారు.

# భారీ వర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి : కలెక్టర్ సంతోష్ ఆదేశాలు




జోగులాంబ, ఆగష్టు 12:రాబోయే రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు . మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా ఎస్పీ తో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాల వల్ల నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు.

వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే విధంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో ప్రమాదకర పరిస్థితులు లేనప్పటికిని , వాగులు, వంకలు ప్రాంతాలలో ప్రమాదాలు జరగకుండా రోడ్డు మార్గాలను డైవర్ట్ చేయాలన్నారు. ఇందుకు గాను పోలీసు, గ్రామ కార్యదర్శుల సహకారం తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా శిథిలావస్థలో ఉన్న గృహాలు, పాఠశాలలను గుర్తించి అందులో ఉండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.

కొన్ని ప్రాంతాలలో వర్షాల వల్ల తెగిపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈనెల 16, 17 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, మండల స్థాయి టీంలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అధికారులు సెలవులో వెళ్లకుండా హెడ్ క్వార్టర్స్ లోనే ఉంటూ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

వర్షాల వల్ల నీరు కలుషితమై దోమలు ప్రబలి సీజనల్ వ్యాధులు డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, వైరల్ ఫీవర్ లాంటి వ్యాధుల పట్ల జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ రహీముద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి నాగేంద్రం, జిల్లా విద్యాధికారి సిద్ధప్ప, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, వివిధ శాఖల అధికారులు , తహసీల్దారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# 14న కరీంనగర్‌లో నిర్వహించబోయే బీసీ కదన భేరి సభ వాయిదా : ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, ఆగష్టు 12: వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 14న కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే.. బీసీ కదన భేరి సభను వాయిదా వేస్తున్నట్లు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రకటించారు. ప్రస్తుతం సభ నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు జరుగుతున్నాయని, అయితే.. వాతావరణ శాఖ చెప్పిన అంశాలను పరిగనణలోకి తీసుకొని వాయిదా వేస్తున్నట్లుగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈనెల 14, 15, 16, 17 తేదీల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశ మున్నట్లు వాతావరణ శాఖ జారీ చేసిన ముందస్తు చేసిన హెచ్చరికల మేరకు.. బీసీ కదన భేరి వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. భేరి ఎప్పుడు నిర్వహించే విషయాన్ని.. తదుపరి ప్రకటిస్తామని, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఈ విషయాన్ని గమనించాలని ఆ ప్రకటనలో కోరారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ.. స్తంభించిన రాకపోకలు



హైదరాబాద్, ఆగష్టు 12:: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. భూదాన్ పోచంపల్లి మండలంలోని జూలూరు - రుద్రెల్లి లో లెవెల్ బ్రిడ్జిపై నుండి నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో పరిసర గ్రామాల ప్రజలు బీబీనగర్, భువనగిరికి వెళ్లేందుకు పెద్ద రావులపల్లి, బట్టుగూడం మీదుగా సుమారు 15 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. మూసీ వరద నీటికి గుర్రపు డెక్క ఆకుతో పాటు చెత్తా చెదారం, వ్యర్థ పదార్థాలు కొట్టుకొస్తున్నాయి. బ్రిడ్జి వద్ద భారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేశారు. మూసీ బ్రిడ్జి వద్ద పరిస్థితిని పోలీసులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

# నూఢిల్లీలో రాష్ట్ర సహకార ఎన్నికల అధికారులతో సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 12:సహకార ఎన్నికల ప్రాధికార సంస్థ (సీఈఏ) ఇవాళ న్యూఢిల్లీలో రాష్ట్ర సహకార ఎన్నికల అధికారులతో తొలి సంప్రదింపుల సమావేశం నిర్వహించింది. దేశవ్యాప్తంగాగల సహకార సంస్థలకు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ దిశగా చర్చల యంత్రాంగాన్ని రూపొందించడం దీని లక్ష్యం. 'సీఈఏ' చైర్మన్ శ్రీ దేవేంద్ర కుమార్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ సమావేశంలో తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, బీహార్ రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వైస్ చైర్‌పర్సన్ శ్రీ ఆర్.కె.గుప్తా, సహకార శాఖ స్వతంత్ర న్యాయాధికారి శ్రీ అలోక్ అగర్వాల్, కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ ఆనంద్ కుమార్ ఝా తదితరులు కూడా ఈ చర్చలో పాలుపంచుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీ దేవేంద్ర కుమార్ సింగ్ మాట్లాడుతూ- ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వం, హోం-సహకారశాఖల మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వాన 'సీఈఏ' ఏర్పాటు సహా సహకార రంగంలో వివిధ సంస్కరణలను ప్రభుత్వం అమలు చేసిందని గుర్తుచేశారు. ప్రాధికార సంస్థ 2024 మార్చి నెలనుంచీ ఇప్పటిదాకా 159 ఎన్నికలను నిర్వహించిందని, అదే తరహాలో ప్రస్తుతం 69 ఎన్నికల నిర్వహణ ప్రక్రియను చేపట్టిందని తెలిపారు.

బహుళ-రాష్ట్ర సహకార సంఘాల చట్టం-2002లోని సెక్షన్ 45తోపాటు 2023లో దాని సవరణ ద్వారా కేంద్రానికి సంక్రమించిన అధికారాల మేరకు సహకార ఎన్నికల ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తూ 2024 మార్చి 11న అధికార ప్రకటన వెలువడింది.

ఈ ఏడాదిని (2025) అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడాన్ని శ్రీ దేవేంద్ర కుమార్ సింగ్ గుర్తుచేశారు. అలాగే సహకార రంగ పురోగమనంపై నిబద్ధతను చాటుకుంటూ ప్రభుత్వం అనేక సంస్కరణలు తెచ్చిందని పేర్కొన్నారు. సహకార సంఘాల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించే దిశగా పారదర్శకత మెరుగుకు ఎన్నికల ప్రక్రియను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సహకార ఎన్నికలకు ప్రామాణిక నిబంధన పత్రం (మాన్యువల్), ప్రవర్తన నియమావళి అవసరం ఎంతయినా ఉందని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా బహుళ-రాష్ట్ర సహకార సంఘం (ఎంఎస్‌సీఎస్) సహా పోటీపడే అభ్యర్థుల కోసం ప్రవర్తన నియమావళి రూపకల్పనపై చర్చించామన్నారు. అంతేకాకుండా అభ్యర్థుల గరిష్ఠ వ్యయ పరిమితి, రిటర్నింగ్ అధికారుల కోసం కరదీపిక ప్రచురణ, జాతీయ సహకార సంఘాలలో సభ్యులైన సహకార సంఘాల నుంచి ప్రతినిధుల ఎన్నిక, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగం సహా ఆయా రాష్ట్ర సహకార ఎన్నికల అధికారులు ప్రతిపాదించిన అంశాలపైనా సమావేశం లోతుగా చర్చించిందని శ్రీ దేవేంద్ర కుమార్ సింగ్ వెల్లడించారు.

వీటన్నిటితోపాటు సభ్యుల వాటా మూలధనం, అభ్యర్థుల కోసం చిహ్నాల వాడకం, సహకార ఎన్నికలలో చెరగని సిరా ఉపయోగం వంటివాటిని తాను స్వయంగా ప్రతిపాదించి చర్చలో పెట్టానని ఆయన తెలిపారు.

ఈ నేపథ్యంలో సహకార ఎన్నికలలో సంస్కరణల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించాలని 'సీఈఏ' నిర్ణయించింది.

ఈ సమావేశంలో తెలంగాణ సహకార ఎన్నికల అథారిటీ కమిషనర్ శ్రీ జి.శ్రీనివాస రావు, తమిళనాడు రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల కమిషన్ కమిషనర్ శ్రీ దయానంద్ కటారియా, ఒడిశా రాష్ట్ర సహకార ఎన్నికల కమిషనర్ శ్రీ శ్రీకాంత ప్రస్టీ, బీహార్ రాష్ట్ర ఎన్నికల అథారిటీ అధికారి శ్రీ గిరీష్ శంకర్‌తోపాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సలహాదారు శ్రీ కుమార్ శాంత రక్షిత్, మహారాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ కమిషనర్ శ్రీ అనిల్ మహాదేవ్ కవాడే, కార్యదర్శి శ్రీ అశోక్ గడే తదితరులు పాల్గొన్నారు.

# లారీ కింద పడి ..

మేడ్చల్, ఆగస్టు 12 : మేడ్చల్ మున్సిపల్ పట్టణంలోని జాతీయ రహదారి 44పై రోడ్డు ప్రమాదం జరిగింది. మేడ్చల్ లో ప్రమాదంలో లారీ టైర్ల కింద పడి ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం మేడ్చల్ మున్సిపల్ పట్టణంలోని స్వామి వివేకానంద కూడలి వద్ద బైక్ పై వెళ్తున్న గంజికుమార్ లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు.

మేడ్చల్ జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ టైర్ల కింద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మృతుడు గంజికుమార్ శరీర భాగాలు ముక్కలు ముక్కలుగా చెల్లా చెదురయ్యాయని స్థానికులు తెలియజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్ వెల్లడించారు.

# ఎందరో త్యాగధనులను అందించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ : మార్క శంకర్‌నారాయణ




హనుమకొండ, ఆగస్టు 12: దేశచరిత్రలో ఎందరో త్యాగధనులను అందించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మార్క శంకర్‌నారాయణ అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏఐఎస్ఎఫ్ 90 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఏఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పథకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా శంకర్‌నారాయణ మాట్లాడుతూ అలుపెరగని సమరశీల ఉద్యమాల వేదిక ఏఐఎస్ఎఫ్, స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమ వారసత్వంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్‌గౌడ్, భాషబోయిన సంతోష్, ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జక్కుల భానుప్రసాద్, బొజ్జు జ్యోతి, కసరబోయిన రవితేజ, సిపతి వినయ్, కొయ్యడ కుశాల్, అభి, లక్ష్మణ్, నికిత వరలక్ష్మి అనుషతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# మువ్వన్నెల జెండా ప్రచార ఉద్యమంలో పేర్లు నమోదు చేసుకున్న 5 లక్షల మందికి పైగా యువత: శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్

న్యూఢిల్లీ, ఆగష్టు 12:'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' (ఇంటింటా మూడు రంగుల జెండా) ప్రచార ఉద్యమం 4వ సంచికను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సగర్వంగా ప్రకటించింది. భారత జాతీయ జెండా 'తిరంగా'ను (త్రివర్ణ పతాకం) ఇంటింటా ఎగరేయడంతో పాటు ఈ భావనను మది నిండా నింపుకొనేటట్లు పౌరులకు స్ఫూర్తిని కలగజేయడం ఈ ప్రచార ఉద్యమం ఉద్దేశం.

ఈ సంవత్సరం మనం 'తిరంగా ప్రచార ఉద్యమం' నాలుగో సంచికను ఉత్సవ స్థాయిలో జరుపుకో బోతున్నాం. దీని కోసం స్వచ్ఛంద సేవకులుగా నమోదు చేసుకున్న యువత సంఖ్య 5 లక్షలు దాటిందని కేంద్ర సాంస్కృతిక మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. ఈ యువతీయువకులలనూ, ప్రజలనూ మూడు రంగుల జాతీయ జెండా ప్రచార ఉద్యమంలో పాల్గొనేలా ప్రేరణను అందించనున్నారని ఆయన అన్నారు.

శ్రీ షెకావత్ ఈ రోజు ఢిల్లీలో విలేకరుల సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తూ, 'హర్ ఘర్ తిరంగా' (ఇంటింటా త్రివర్ణ పతాక) ఒక్క ప్రచార ఉద్యమ స్థాయికే పరిమితం కాదు.. అంతకు మించి ఇది ఒక భావోద్వేగభరిత ఉద్యమం. 140 కోట్ల భారతీయులను మన జాతీయ జెండా లోని నిత్యశోభాయమానమైన మూడు రంగులతో మేళవిస్తుందన్నారు. దీని లక్ష్యం దేశభక్తి భావనను పాదుగొల్పడం, పౌరులలో సంతోషం ఉప్పొంగేటట్లు చేయడంతో పాటు మన స్వాతంత్ర్యం, మన ప్రజాస్వామ్యాల సజీవ ప్రతీకగా నిలుస్తున్న మువ్వన్నెల జెండా ప్రాధాన్యాన్ని విస్తృత స్థాయిలో చాటిచెప్పడమని మంత్రి అన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి శ్రీ వివేక్ అగర్వాల్ తిరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చి ప్రచార ఉద్యమం సమగ్ర వివరణను కళ్లకు కట్టారు. హోం శాఖ అదనపు కార్యదర్శి శ్రీ అభిజిత్ సిన్హా, జల శక్తి శాఖ ఆర్థిక సలహాదారు శ్రీ సమీర్ కుమార్ తమ తమ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, కేంద్ర సాయుధ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్) అధికారులు కూడా పాల్గొన్నారు.

జాతీయ జెండాకు, పౌరులకు మధ్య సంబంధాన్ని లాంఛనప్రాయం, సంస్థాగత సంబంధం స్థాయుల నుంచి ఒక ప్రగాఢ వ్యక్తిగత అనుబంధం స్థాయికి పెంపొందించాలనే ఉద్దేశంతో 'హర్ ఘర్ తిరంగా' ప్రచార ఉద్యమాన్ని రూపొందించారు. ఇది దేశంలో ప్రతి ఒక్కరూ సంతోషంతో, గౌరవంతో త్రివర్ణ పతాకాన్ని ఎగరేసి, భారత్ స్వాతంత్ర్యాన్ని వందుగ చేసుకోవాలంటూ పౌరులను ఉత్తేజితులను చేస్తోంది.

ఈ కార్యక్రమానికి విశేష ప్రతీకాత్మక విలువ కూడా ఉంది. మువ్వన్నెల జెండాను ఇంటి వద్ద ఎగరేయడం అంటే అది ఒక వ్యక్తిగత అనుబంధాన్ని చాటడంతో పాటు, దేశ నిర్మాణానికి మన వంతు పాటుపడతామన్న నిబద్ధతను పునరుద్ఘాటించడానికి ఒక ప్రతీక. ఇది మన దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన త్యాగమూర్తులను గుర్తుకు తెచ్చుకోవడానికి, ఏకత, అఖండత, ప్రగతి.. ఈ విలువల్ని నిలబెడతామన్న ప్రతిజ్ఞకు కూడా ఒక సంకేతంగా నిలుస్తోంది.

ఈ ప్రచార ఉద్యమానికి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నోడల్ మినిస్ట్రీగా వ్యవహరిస్తోంది. ఈ ప్రచార ఉద్యమంలో పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొనేటట్లు చూడడానికి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలతో పాటు సాధారణ ప్రజానీకంతో ఈ శాఖ సన్నిహిత సమన్వయాన్ని నెలకొల్పుకొని పనిచేస్తోంది. పౌరులు జాతీయ జెండాను వారి ఇళ్లు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎగరేయాలనీ, ఈ వేడుకల ఫోటోలను, కథనాలను 'హర్ ఘర్ తిరంగా' కు ట్యాగ్ చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పొందుపరచాలనీ వారికి మంత్రిత్వ శాఖ సూచిస్తోంది.

గత మూడేళ్లుగా ప్రజలు సవంది కోత్సాహంతో పాల్గొంటుండడంతో, 'హర్ ఘర్ తిరంగా' ఒక ప్రజా ఉద్యమంగా మారింది. ఇది స్వాతంత్ర్య దినోత్సవాన్ని చైతన్యం ఉప్పొంగే, దేశమంతటా భిన్నత్వంలో ఏకత్వాన్ని పండుగ చేసుకొనే ఘడియలుగా మలచింది. ఈ ఏడాది సంచిక మన జాతీయ స్ఫూర్తిని, హర్షాన్ని పునరుద్ఘాటిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఏపీకి సెమికండక్టర్ ప్రాజెక్ట్.. కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు..!

అమరావతి, ఆగష్టు 12: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రూ. 18,541 కోట్ల విలువైన పథకాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో నాలుగు కొత్త సెమికండక్టర్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. ఈ ప్రాజెక్టులకు దాదాపు రూ. 4,594 కోట్లు ఖర్చు చేయనుండగా.. ఒడిశా, పంజాబ్, ఏపీలో ప్రారంభించనున్నారు. రూ. 5,801 కోట్ల వ్యయంతో నిర్మించనున్న లక్నో మెట్రో ఫేజ్ వన్ బీ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగల్న్ ఇచ్చింది. అలాగే, రూ. 8,146 కోట్ల వ్యయంతో నిర్మించనున్న క్లీన్ గ్రోత్: టాటో-ఎచ జలవిద్యుత్ ప్రాజెక్టును సైతం ఆమోదించింది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే 700 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తవు తుంది. కేంద్ర మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాల గురించిన వివరాలను కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

భారత సెమికండక్టర్ మిషన్ కింద మరో నాలుగు సెమికండక్టర్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ూతిఊవఎ, కాంటినెంటల్ డివైసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ , 3ఆ గ్లాస్ సొల్యూషన్స్ ఇంక్, అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్‌కు సంబంధించినవని చెప్పారు. ఒడిశా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లలో యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దాదాపు రూ. 4,600 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులతో 2,034 మంది నైపుణ్యం కలిగిన నిపుణులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టులతో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ ఎకో సిస్టమ్‌కు ఊతం లభిస్తుందన్నారు. అదే సమయంలో పరోక్షంగా ఉద్యోగాలు కూడా సృష్టిస్తాయని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం ఐఎస్ఎం కింద మొత్తం పది ప్రాజెక్టులను ఆమోదించినట్లు వెల్లడించారు. గతంలో ఆరు రాష్ట్రాల్లో సుమారు రూ. 1.60లక్షల పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. లక్నో మెట్రో రైలు ప్రాజెక్ట్-1బీని సైతం ఆమోదించినట్లు తెలిపారు.

ఈ ప్రాజెక్టులో 12 స్టేషన్లతో 11.165 కిలోమీటర్ల పొడవైన కారిడార్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. మెట్రో రైలు నెట్‌వర్క్‌ను 34 కిలోమీటర్లకు విస్తరించే ప్రణాళిక ఉందని చెప్పారు. అమీనాబాద్, యాహియాగంజ్, పాండేగంజ్ తదితర వాణిజ్య కేంద్రాలు.. కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ (మెడికల్ కాలేజ్), ఇమాంబర, చోటా ఇమాంబర, భూల్ భూలైయా, ఘంటాఘర్, రూమి దర్వాజా ప్రాంతాలను మెట్రో నెట్‌వర్క్‌తో అనుసంధామవుతామన్నారు. ప్రాజెక్టు కోసం దాదాపు రూ. 5,801 కోట్లు ఖర్చు అవుతాయన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని షియోమి జిల్లాలో 700 మెగావాట్ల టాటో-ఎచ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ. 8146.21 కోట్లు ఖర్చవుతుందని.. 72 నెలల కాలంలో పూర్తవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు 2738.06 ఎంయు శక్తిని ఉత్పత్తి చేసే 700 ఎండబ్ల్యు (4 × 175 ఎండబ్ల్యు) సామర్థ్యం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టును నార్త్ ఈస్టర్న్ ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం జాయింట్ వెంచర్ కంపెనీ ద్వారా నిర్వహిస్తాయన్నారు.

# 'చెట్లకు మేకులు కొట్టొద్దు, తీగలు చుట్టొద్దు'




ఖమ్మం, ఆగష్టు 12: చెట్లకు మేకులు కొట్టడం, తీగలు చుట్టడం వల్ల వాటి ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతోందని జూలూరుపాడు ఎంపీడీఓ తాళ్లూరి రవి అన్నారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశాను సారం 'సర్వీస్ టు వన దేవత' పేరిట అధికార యంత్రాంగం వృక్షాలను కాపాడే చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భాగంగా మంగళవారం జూలూరుపాడు అధికార యంత్రాంగం మండలంలో ఉన్న చెట్లకు ఉన్న ప్రకటన బోర్డులు, తీగలు, మేకుల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. తీగలు కట్టిన చోట గాట్లు పడి చెట్టు ఎదుగుదల ప్రభావితం అవుతుందన్నారు. ఒక్కోసారి గాలి దుమారానికి విరిగి పడే ప్రమాదం ఉందని తెలిపారు.

చెట్లకు పెద్ద పెద్ద ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయడంతో గాలులకు ప్రకటన బోర్డులు రోడ్డుపై పడిపోతూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు వెల్లడించారు. వినోబా నగర్, సాయిరాం తండా, పడమటి నరసాపురం ఏరియాల్లో రోడ్డు పక్కన చెట్లకు ఉన్న తీగలు, మేకులు తొలగించారు. సమస్య పునరావృతమైతే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోనున్నారు. రోడ్డు పక్కన వృక్షాలపై పంచాయతీ సిబ్బంది. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు.

# బాల్ సాహిత్య ప్రైవేట్ పేపర్ సేకరణను "శిక్షార్థి" స్వాధీనం



న్యూఢిల్లీ, ఆగష్టు 12:నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ ప్రస్తుత రికార్డుల సంరక్షకురాలు మరియు పబ్లిక్ రికార్డ్ చట్టం 1993 నిబంధన ప్రకారం నిర్వాహకులు మరియు పరిశోధకుల ఉపయోగం కోసం వాటిని ట్రస్ట్‌లో ఉంచుతుంది. ఒక ప్రధాన ఆర్కైవల్ సంస్థగా, నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా ఆర్కైవల్ చైతన్యాన్ని మార్గనిర్దేశం చేయడంలో మరియు రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రజా రికార్డుల యొక్క విస్తారమైన సేకరణతో పాటు, మన దేశానికి గణనీయమైన కృషి చేసిన అన్ని రంగాలకు చెందిన ప్రముఖ భారతీయుల ప్రైవేట్ పేపర్ల యొక్క గొప్ప మరియు నిరంతరం పెరుగుతున్న సేకరణను ఔంఎ కలిగి ఉంది.

భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా (ఔంఎ), ప్రఖ్యాత రచయిత మరియు కార్టూనిస్ట్ రామ్ పదార్థ్ "శిక్షార్థి" (03 జూన్ 1919 - 20 నవంబర్ 1981) రూపొందించిన బాల్ సాహిత్యంపై కార్టూన్లు, నవలలు మరియు పుస్తకాల అరుదైన మరియు విలువైన సేకరణను కొనుగోలు చేసింది.

ఆయన కుమార్తె శ్రీమతి అల్పనా నిగమ్ విరాళంగా ఇచ్చిన ఈ సేకరణలో ఆయన కాలంలోని సామాజిక-రాజకీయ మరియు సాంస్కృతిక దృశ్యాన్ని ప్రతిబింబించే విస్తృత శ్రేణి రచనలు ఉన్నాయి. ఆయన రాజకీయ కార్టూన్లు చాలా వరకు ఆ యుగ స్ఫూర్తిని ప్రతిబింబించినప్పటికీ, ఆయన రాజకీయేతర రచనలు సాధారణ ప్రజల దైనందిన జీవితాన్ని హాస్యభరితంగా మరియు వ్యంగ్యంగా చిత్రీకరించాయి. "శిక్షార్థి" తన సొంత ప్రింటింగ్ ప్రెస్‌ను కూడా స్థాపించాడు మరియు భారతదేశంలో ఆరోగ్యకరమైన బాలల సాహిత్యాన్ని (బాల్ సాహిత్యం) ప్రోత్సహించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు. ముద్రిత రచనలతో పాటు, భారతీయ కళ, సాహిత్యం మరియు సమాజానికి శిక్షార్థి చేసిన కృషిని హైలైట్ చేసే చేతితో రాసిన విషయాలు ఈ సేకరణలో ఉన్నాయి. నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా దేశం యొక్క డాక్యుమెంటరీ వారసత్వాన్ని కాపాడటానికి మరియు పరిశోధకులు, పండితులు మరియు ప్రజలకు అందుబాటులో ఉంచడానికి కట్టుబడి ఉంది.

# 27 నుంచి 6 వరకు గణేశ్ నవరాత్రులు




హైదరాబాద్, ఆగష్టు 12:రానున్న గణేశ్ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, శాంతియుత వాతావరణంలో జరిగేలా భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు సహకారం అందించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ పేర్కొన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో 27 ప్రారంభమై వచ్చే నెల 6న పూర్తి కానున్న గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి, సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది.

ఇప్పటికే గ్రేటర్‌లో అధిక వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు కమిషనర్ చెప్పారు.

గణేశ్ ప్రతిమల ఊరేగింపు జరిగే జాతీయ రహదారుల్లో ఏమైనా రోడ్లు దెబ్బతింటే వాటిని కూడా చేపడతామని తెలిపారు.

# లక్నో మెట్రో రైల్ ప్రాజెక్టు కింద రూ.5,801 కోట్లతో 12 స్టేషన్లు గల

## 11.165 కి.మీ. 'ఫేజ్-1బి' పనులకు మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 12:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇవాళ న్యూఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఉత్తరప్రదేశ్ లోని లక్నో మెట్రో రైల్ ప్రాజెక్టు 'ఫేజ్-1బి' పనులకు ఆమోదం తెలిపింది. ఇది 11.165 మీటర్ల పొడవైన మార్గం కాగా- ఇందులో 7 భూగర్భ, 5 ఎలివేటెడ్- మొత్తం 12 స్టేషన్లు ఉంటాయి. ఇది పూర్తయితే, లక్నో నగరంలో 34 కిలోమీటర్ల మెట్రో రైలు నెట్‌వర్క్ ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

'ఫేజ్-1బి' పనులు లక్నో నగర మెట్రో రైలు నెట్‌వర్క్ కీలక విస్తరణలో భాగం కావడంతో నగరమంతటా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో గణనీయ పురోగమనానికి ప్రతీకగా నిలుస్తాయి.

ఈ పనులతో సుమారు 11. 165 కిలోమీటర్ల మేర కొత్త మెట్రో మార్గాలు అందుబాటులోకి వస్తాయి. దీంతో లక్నో నగరంలోని అత్యంత పురాతన, అధిక జనసాంద్రత, చౌకైన ప్రజా రవాణా కొరతగల ప్రాంతాలకు సంధాన సౌలభ్యం గణనీయంగా మెరుగుపడుతుంది.

ఈ దశ పాత లక్నోలోని కీలక మండలాలను సజావుగా అనుసంధానించడం లక్ష్యంగా పెట్టుకుంది, వీటిలో ఇవి ఉన్నాయి:

ఈ కీలక ప్రాంతాలను మెట్రో నెట్‌వర్క్‌తో జోడించే 'ఫేజ్-1బి'తో అనుసంధానం మరింత మెరుగవుతుంది. దాంతోపాటు ఆర్థిక కార్యకలాపాలకు ఉత్తేజం, పర్యాటక రంగానికి ప్రేరణ లభిస్తాయి. స్థానిక ప్రజలకు, సందర్శకులకు పట్టణ రవాణా సౌలభ్యం ఇనుమడిస్తుంది.

వాహన రద్దీ తగ్గుదల: రోడ్డు రవాణాతో పోలిస్తే మెట్రో రైల్ నెట్‌వర్క్ సహజంగానే చౌకైన ప్రత్యామ్నాయం. ఈ నేపథ్యంలో 'ఫేజ్-1బి' ద్వారా లక్నో నగరంలో మెట్రో రైలు నెట్‌వర్క్ పొడిగింపుతో రహదారులపై వాహన రద్దీ తగ్గుతుందని అంచనా. ముఖ్యంగా అమిత రద్దీగా కనిపించే పాత లక్నో మార్గాల్లో ఈ ప్రభావం అధికంగా ఉంటుంది. దీనివల్ల వాహన రాకపోకలు సజావుగా సాగి, ప్రయాణ సమయం కలిసిరావడమేగాక రహదారి భద్రతకూ భరోసా లభిస్తుంది.

పర్యావరణ ప్రయోజనాలు: లక్నో నగరంలో 'ఫేజ్-1బి' మెట్రో రైలు ప్రాజెక్ట్ అదనంగా అందుబాటులోకి వస్తే పర్యావరణానికీ మేలు కలుగుతుంది. ఈ మేరకు సంప్రదాయ శిలాజ ఇంధన ఆధారిత రవాణాతో పోలిస్తే కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయి.

ఆర్థిక వృద్ధి: ప్రయాణ సమయం తగ్గుదలతోపాటు నగర పరిధిలోని విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, బస్సు డిపోల వంటి వివిధ ప్రాంతాలకు రవాణా సౌలభ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగులు, కార్మికులు తమ కార్యాలయాలకు, పని ప్రదేశాలకు స్వల్ప వ్యయంతో సకాలంలో చేరుకోగలరు కాబట్టి ఉత్పాదకత కూడా ఇనుమడిస్తుంది. అనుసంధానం మెరుగుదల వల్ల స్థానిక వ్యాపారాలకు... ముఖ్యంగా కొత్త మెట్రో స్టేషన్ల సామీప్య ప్రాంతాల్లో ఊపు లభిస్తుంది. అలాగే లోగడ సౌలభ్య లోపంగల ప్రాంతాల్లో పెట్టుబడులకు, ప్రగతికి అవకాశం ఉంటుంది.

సామాజిక ప్రభావం: లక్నోలో 'ఫేజ్-1బి' మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ వల్ల ప్రజా రవాణా ప్రజలందరికీ సమానంగా అందుబాటులోకి వస్తుంది. తద్వారా విభిన్న సామాజిక-ఆర్థిక వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. రవాణా సౌలభ్యంలో అసమానతలు తగ్గి, ప్రయాణ సమయం ఆదా కావడం ద్వారా నిత్యావసర సేవల లభ్యత మెరుగుపడి జనజీవన నాణ్యత ఇనుమడిస్తుంది.

లక్నో మెట్రో రైలు ప్రాజెక్ట్ 'ఫేజ్-1బి' నగర పరిణామాత్మక ప్రగతికి ఇతోధికంగా తోడ్పడుతుంది. అనుసంధానం పెరుగుదల, వాహన రద్దీ తగ్గుదల, పర్యావరణ ప్రయోజనాలు, ఆర్థిక వృద్ధి, జనజీవన నాణ్యత మెరుగుదల వగైరాలకు భరోసా ఇస్తుంది. పట్టణ ప్రాంతాల్లో కీలక సమస్యలకు పరిష్కారం చూపడం, భవిష్యత్ విస్తరణకు పునాది వేయడం ద్వారా నగర పురోగమనం, సుస్థిరత సాధనలో కీలక పాత్ర పోషిస్తుంది.

## రక్తపోటును, మధుమేహాన్ని నియంత్రించడానికి చేపట్టిన చర్యలు

న్యూఢిల్లీ, ఆగష్టు 12:ఆరోగ్యం రాష్ట్ర జాబితాలో ప్రస్తావించిన అంశం. ఏమైనా, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం)లో భాగంగా అసాంక్రామిక వ్యాధుల నివారణ, నియంత్రణలకు ఉద్దేశించిన జాతీయ కార్యక్రమం (ఎన్‌పీ-ఎన్‌సీడీ)లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సాంకేతిక సహాయంతో పాటు ఆర్థిక సహాయాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ అందిస్తోంది. ఈ కార్యక్రమం మౌలిక సదుపాయాలను పటిష్ఠపరచడంపైన, మానవ వనరులను పెంచడంపైన, పరీక్షలు, ముందుగా రోగనిర్ధారణ, సిఫారసు సేవ, చికిత్సతో పాటు రక్తపోటు, మధుమేహం సహా అసాంక్రామిక వ్యాధుల (ఎన్‌సీడీస్) విషయంలో మానవ ఆరోగ్య పరిరక్షణ.. ఈ అంశాల్లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అవసరాలు, అవి పంపే ప్రతిపాదనలపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొంటోంది. ఈ కార్యక్రమం కింద 77 జిల్లా ఎన్‌సీడీ క్లినిక్‌లు, 233 కార్డియాక్ కేర్ యూనిట్లతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 6,410 ఎన్‌సీడీ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు.

రక్తపోటు, మధుమేహం సహా సాధారణ ఎన్‌సీడీల పరీక్షలు, నివారణతో పాటు నియంత్రణే ధ్యేయంగా జనాభా ఆధారిత కార్యక్రమాన్ని ఎన్‌హెచ్ఎంలో భాగంగా ప్రారంభించారు. సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో ఎన్‌హెచ్ఎం ఒక భాగంగా ఉంటుంది. 30 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వారికి ఈ కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించారు.

వయస్సు 30 ఏళ్లు, అంత కన్నా ఎక్కువ ఉన్న వారందరికీ పరీక్షలు నిర్వహించడానికి గత ఫిబ్రవరి 20 నుంచి గత మార్చి నెలాఖరు వరకు రక్తపోటు, మధుమేహం సహా ఎన్‌సీడీ పరీక్షల కార్యక్రమాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మొదలుపెట్టింది.

## హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 100వ వారం హనుమాన్ చాలీసా పారాయణం



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 12:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో మంగళవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 100వ వారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మాన్ని కాపాడుతూ హనుమాన్ చాలీసా పారాయణం గావిస్తున్న హిందూ ఉత్సవ సమితికి శుభాకాంక్షలు తెలియజేశారు. చాలీసా పారాయణం ఆరోగ్యానికి ఎంతో శుభదాయకం ప్రతి ఒక్క హిందువు ఇంట్లో కూడా ప్రతిరోజు హనుమాన్ చాలీసా పారాయణం గావించినచో ఎలాంటి రోగాలు దరిచేరవని, ఎలాంటి దుష్ట శక్తులు కూడా ఇంటి దరిదాపులకు కూడా రావని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని 108 పర్యాయాలు చాలీసా పారాయణం గావించారు.

## సీఎం రేవంత్ రెడ్డితో అల్ఫోర్స్ చైర్మన్ వి నరేందర్ రెడ్డి భేటీ



కరీంనగర్, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని వారి నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రానికి అనేక పెట్టుబడు లు, పరిశ్రమలు తీసుకురావడమే కాకుండా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుం దని వారు హర్షం వ్యక్తం చేస్తూ అహర్నిశలు కృషి చేస్తున్న వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## గుట్ట ఘాట్ రోడ్డు నిర్మాణంలో తొమ్మిదేళ్లు

### -రూ 50 జీతం తో సూపర్వైజర్ గా పనిచేసిన చెన్నోజు వెంకట్ నర్సయ్య

యాదగిరిగుట్ట, ఆగస్టు 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ అత్యంత పురాతనమైన యాదగిరిగుట్ట శ్రీ స్వయంభువు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిలో ఒక కార్మికుడిగా పనిచేసే భాగ్యం తనకు లభించిందని పట్టణానికి చెందిన చెన్నోజు వెంకట్ నర్సయ్య (88) ఆనందం వ్యక్తం చేశారు... దాదాపు 50 సంవత్సరాల క్రితం కొండపైకి ఘాటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. మెదక్ నర్సాపురం కు చెందిన గుత్తేదారు రామ్ రావు వద్ద నెలకు 50 రూపాయల జీతంతో 9 సంవత్సరాల పాటు ఘాటు రోడ్డు నిర్మాణంలో సూపర్వైజర్ గా పనిచేశానని చెప్పారు. యంత్రాలు అందుబాటులో లేని ఆ కాలంలో రోజూ వందలాది మంది కార్మికులు పనిచేసేవారని. ఘాటు రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యేసరికి 15 సంవత్సరాలు పట్టిందన్నారు. సైదాపురం గ్రామానికి చెందిన రావి నరసింహారెడ్డి ,రంగయ్య అనే వారు కూడా పనిచేసేవారని అన్నారు. కురువృద్ధుడైన వెంకట్ నరసయ్య ఈ సందర్భంగా ఆనాటి స్థితిగతులను నెమరు వేసుకున్నారు. 50 రూపాయల నెలసరి జీతంతో తన కుటుంబం హాయిగా బతికేదని, రూపాయికి నాలుగు కిలోల బియ్యం, కేవలం చారాణ ( 25 పైసలు నాణెం) బిళ్ళకే పావు సేరు (పావు కిలో )బోటి లభించేదని చెప్పుకొచ్చారు. యాలాల బసవయ్య, సీతారామయ్య పంతులు దేవస్థానంలో ఆనాటి ప్రముఖులని... అభివృద్ధి చెందిన తర్వాతనే రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ఈ దేవస్థానం ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు .ఆ విధంగా శ్రీ స్వామివారి సేవలో పని చేసుకునే భాగ్యం లభించిందని ఆయన ఆనందపడ్డారు.

# ఒడిశా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లో రూ.4600 కోట్ల వ్యయంతో

## సెమీకండక్టర్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 12:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద మరో నాలుగు సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.

ఇప్పటికే వివిధ దశల్లో అమల్లో ఉన్న ఆరు ఆమోదిత సెమీ కండక్టర్ ప్రాజెక్టులతో భారత్‌లోని సెమీ కండక్టర్ వ్యవస్థ వేగం పుంజుకుంటోంది. ఈ రోజు ఆమోదం పొందిన నాలుగు ప్రతిపాదనలు ఎస్ఐసీసెమ్, కాంటినెంటల్ డివైజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (సీడీఐఎల్), 3డీ గ్లాస్ సొల్యూషన్స్ ఐఎన్‌సీ, అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ (ఏఎస్ఐపీ) టెక్నాలజీల నుంచి వచ్చాయి.

ఆమోదం పొందిన ఈ నాలుగు ప్రతిపాదనలు సుమారుగా రూ. 4, 600 కోట్ల పెట్టుబడితో సెమీకండక్టర్ తయారీ సౌకర్యాలను ఏర్పాటు చేసి 2034 మంది నిపుణులకు ఉద్యోగాలు కల్పిస్తాయని అంచనా వేస్తున్నారు. ఎలక్ట్రానిక్ తయారీ వ్యవస్థకు ప్రోత్సాహం పరోక్షంగా అనేక ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఈ రోజు మరో నాలుగు ప్రతిపాదనలను ఆమోదించడంతో ఐఎస్ఎం ద్వారా ఆమోదం పొందిన ప్రాజెక్టుల మొత్తం సంఖ్య పదికి, మొత్తం పెట్టుబడులు 6 రాష్ట్రాల్లో రూ. 1.60 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

టెలికాం, ఆటోమోటివ్, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్ వినియోగ వస్తువులు, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్‌లో సెమీకండక్టర్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా ఆమోదం పొందిన నాలుగు సెమీ కండక్టర్ ప్రాజెక్టులు ఆత్మనిర్భర్ భారత్‌కు గణనీయంగా తోడ్పడతాయి.

ఎస్ఐసీసెమ్, త్రీడీ గ్లాస్ లను ఒడిశాలో నెలకొల్పుతారు. సీడీఐఎల్ పంజాబ్‌లో ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో ఏఎస్ఐపీ ఏర్పాటవుతుంది.

ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఉన్న ఇన్ఫో వ్యాలీలో సిలికాన్ కార్బయిడ్ (ఎస్ఐసీ) ఆధారిత కాంపౌండ్ సెమీ కండక్టర్ సమీకృత తయారీ కేంద్రాన్ని యూకేకి చెందిన క్లాస్-సిక్ వేఫర్ ఫ్యాబ్ లిమిటెడ్ సహకారంతో ఎస్ఐసీసెమ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోంది. ఇది దేశంలోనే మొదటి వాణిజ్య కాంపౌండ్ తయారీ వ్యవస్థ అవుతుంది. సిలికాన్ కార్బయిడ్ పరికరాలను తయారు చేయాలని ఈ ప్రాజెక్టు ప్రతిపాదించింది. ఈ కాంపౌండ్ సెమీకండక్టర్ తయారీ వ్యవస్థకు ఏడాదికి 60,000 వేఫర్ల తయారీ, 96 మిలియన్ యూనిట్ల ప్యాకేజింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ప్రతిపాదిత ఉత్పత్తులను క్షిపణులు, రక్షణ పరికరాలు, విద్యుత్ వాహనాలు (ఈవీలు), రైల్వే, ఫాస్ట్ ఛార్జర్లు, డేటా సెంటర్ ర్యాకులు, వినియోగ వస్తువులు, సోలార్ పవర్ ఇన్వర్టర్లలో ఉపయోగిస్తారు.

ఒడిశాలోని భువనేశ్వర్‌లో, ఇన్ఫో వ్యాలీలో సమీకృత అధునాతన ప్యాకేజింగ్, ఎంబెడెడ్ గ్లాస్ సబ్‌స్ట్రేట్ యూనిట్‌ను 3 డీ గ్లాస్ సొల్యూషన్స్ ఐఎన్‌సీ (త్రీడీజీఎస్) ఏర్పాటు చేస్తుంది. ఈ యూనిట్ అత్యంత ఆధునిక ప్యాకేజింగ్ సాంకేతికతను భారత్‌కు తీసుకువస్తుంది. ఈ తయారీ కేంద్రంలో పాసివ్స్, సిలికాన్ బ్రిడ్జిలు ఉన్న గ్లాస్ ఇంటర్ పోజర్, త్రీడీ హెటిరోజీనస్ ఇంటిగ్రేషన్ (3డీహెచ్ఐ) మాడ్యూళ్లతో సహా వివిధ రకాల అత్యాధునిక సాంకేతికతలు ఉంటాయి. ఏడాదికి 69,600 గ్లాస్ ప్యానెల్ సబ్‌స్ట్రేట్స్, 50 మిలియన్ అసెంబుల్డ్ యూనిట్లు, 13,200 త్రీడీహెచ్ఐ మాడ్యూళ్లను తయారు చేసే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంటుంది. ప్రతిపాదిత ఉత్పత్తులను రక్షణ, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, ఆర్ఎఫ్, ఆటోమేటివ్, ఫోటానిక్స్, కో-ప్యాకేజ్డ్ ఆప్టిక్స్ తదితరమైన వాటిలో ఉపయోగిస్తారు.

ఆంధ్రప్రదేశ్‌లో సెమీ కండక్టర్ తయారీ యూనిట్‌ను దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కో లిమిటెడ్ సంస్థ సహకారంతో అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్ (ఏఎస్ఐపీ) ఏర్పాటు చేస్తుంది. దీని వార్షిక సామర్థ్యం 96 మిలియన్ యూనిట్లు. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులను మొబైల్ ఫోన్లు, సెట్-టాప్ బాక్సులు, ఆటోమొబైల్ అప్లికేషన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో ఉపయోగిస్తారు.

పంజాబ్‌లోని మొహాలీలో తన ప్రత్యేక సెమీ కండక్టర్ తయారీ యూనిట్‌ను కాంటినెంటల్ డివైజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (సీడీఐఎల్) విస్తరించనుంది. సిలికాన్, సిలికాన్ కార్బయిడ్ ఉపయోగించి ఎంఓఎస్ఎఫ్ఈటీలు, ఐజీబీటీలు, షాట్కీ బైపాస్ డయోడ్లు, ట్రాన్సిస్టర్లు తరహా హై పవర్ డిస్క్రీట్ సెమీకండక్టర్ పరికరాలు ఇక్కడ తయారవుతాయి. ఇప్పటికే ఉన్న యూనిట్‌ను విస్తరించడం ద్వారా దీని వార్షిక సామర్థ్యం 158.38 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుంది. ప్రతిపాదిత యూనిట్లలో తయారు చేసే పరికరాలు ఈవీలు, వాటి చార్జింగ్ మౌలిక సదుపాయాలతో సహా ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, విద్యుత్ నిల్వ చేసే పరికరాలు, పారిశ్రామిక అప్లికేషన్లు, ప్రసార మౌలిక సదుపాయాల్లో ఉపయోగిస్తారు.

దేశంలోనే మొట్టమొదటి వాణిజ్య కాంపౌండ్ తయారీ వ్యవస్థ, అత్యాధునిక గ్లాస్ ఆధారిత సబ్‌స్ట్రేట్ సెమీకండక్టర్ ప్యాకేజింగ్ యూనిట్‌తో సహా ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టులతో దేశంలో సెమీ కండక్టర్ల వ్యవస్థకు గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుంది.

278 విద్యా సంస్థలు, 72 అంకుర సంస్థలకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు అంతర్జాతీయ స్థాయి చిప్ రూపకల్పన సామర్థ్యాలను దేశంలో విస్తరించేందుకు ఉపకరిస్తుంది.

ఇప్పటికే 60,000 మందికి పైగా విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ప్రయోజనాలను పొందారు.

## పిల్లలకో బహుమతి కథల సంపుటి ఆవిష్కరణ



హైదరాబాద్, ఆగష్టు 12:మచిలీపట్నంలో స్థానిక మహతి లలిత కళా వేదికలో 09-08-2025 శనివారం సాయంత్రం శ్రీ ఏడుకొండలు కళ్ళేపల్లి రచించిన 'పిల్లలకో బహుమతి' కథల సంపుటి ఆవిష్కరించబడింది.

సభాధ్యక్షులు శ్రీ భవిష్య మాట్లాడుతూ బాల సాహిత్యం రాసే వారి సంఖ్య క్రమంగా తగ్గి పోతున్న ఈరోజుల్లో ఇలా పిల్లల కథలు పుస్తక రూపంలో రావడం ఎంతో అవసరం అన్నారు.

ముఖ్య అతిథి మరియు పుస్తక ఆవిష్కర్త శ్రీ లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఇప్పుడు పిల్లలు నీతి కథల పుస్తకాలు చదవడం అనేది మానేశారు పుస్తకాలు చదివే స్థానంలో యూట్యూబ్ లో రీల్స్ చూడ్డానికి ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు తప్పితే ఇటువంటి బాల సాహిత్యాన్ని ముఖ్యంగా పిల్లలకు అవసరమైన నీతి కథలను చదవడానికి ఎవరు ఇష్టపడటం లేదు కనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలు నీతి కథలు చదివేలా వారిని ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉంది అని అన్నారు పుస్తక సమీక్షులు శ్రీ టి. పెద్దిరాజు మాట్లాడుతూ 31 కథలతో కూడిన ఈ పుస్తకం పిల్లల్ని పెద్దల్ని ఆకట్టుకునేలా ఉండడంతో పాటు ఇది నిజంగా పిల్లలకో విలువైన బహుమతి అని అన్నారు ఏ కథకు ఆ కథే మంచి విలువలతో కూడిన సందేశాన్ని అందించిందని తెలియజేశారు.

గౌరవ అతిథి శ్రీ అప్పినేడు పోతురాజు మాట్లాడుతూ ఇటువంటి నీతి కథలు పిల్లల్లో వ్యక్తిత్వాన్నితీర్చిదిద్దుతాయని అన్నారు. రచయిత శ్రీ ఏడుకొండలు కళ్ళేపల్లి మాట్లాడుతూ" బాల సాహిత్యంలో ఇప్పటివరకు 103 కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమైనాయనీ, బాల సాహిత్యం లో 100 కథల మైలురాయి దాటినందుకు ఆనందంగా ఉందని, 31 కథలతో మొదటి కథల సంపుటి ×పిల్లలకో బహుమతిని× విడుదల చేయటం జరిగిందని ఇది పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించడానికి తోడ్పడుతుందని భావిస్తున్నాను'' అని అన్నారు. కార్యక్రమంలో రచయిత శ్రీ కళ్ళేపల్లి తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో హర్ గర్ తీరంగా బైక్ ర్యాలీ



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 12:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పురవీధుల గుండా మంగళవారం బిజెపి పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రతాపరామకృష్ణ పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి బైకుపై జాతీయ జెండాతో స్వారీ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులలో మహనీయులైన సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి, స్మరించు కున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాపరామకృష్ణ హాజీరై మాట్లాడారు జాతీయ జెండాను రేపటి నుంచి మూడు రోజులపాటు ప్రతి ఒక్కరు కూడా ఇంటి పై ఎగరవేసి మన దేశ ఔన్నత్యానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల బలిదానాలతో వచ్చిన స్వతంత్ర భారత దేశం లో మనము జీవనం కొనసాగి స్తూన్నామని, ప్రతి ఒక్క భారతీయుడు కూడా ఇంటిపై జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధులు వెంకటస్వామి, నాయకులు రేగుల మల్లికార్జున్, సంటి మహేష్, చందనం రవి, కృష్ణ స్వామి, రేగుల శ్రీకాంత్, నేరెళ్ల సాయి, వివేక్ యశ్వంత్, మనీష్, రాజశేఖర్, బిల్లా కృష్ణ, నర్సయ్య, ఖడ్గం శీను, లక్ష్మీరాజం, శేఖర్, రాహుల్, బచ్చు వంశీ, మనోజ్, పిన్నింటి హనుమన్లు, డాక్టర్ వెంకటేశం, బిజెపి పట్టణ కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరాటే లో కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ

### -బంగారం, వెండి పత కాలు కైవసం

### స్కూల్ కరెస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 12:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కు చెందిన విద్యార్థులు ఇటీవల సిరిసిల్ల పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఓపెన్ కరాటే, కుంగ్ ఫు చాంపియన్షిప్ 2025 పోటీల్లో నరెడ్ల నిహాంత్ రెడ్డి కి గోల్డ్ మెడల్, గాజుల వివేక శ్రీ కటాస్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినారు. ఈ విజయం పట్ల పాఠశాల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ విద్యార్థులను అభినందించినారు. ఈ పిల్లలు భవిష్యత్తులో ఇంకెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించినారు. ఈ విజయం పట్ల పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ హర్షం వ్యక్తం చేశారు.

## నేడు సికింద్రాబాద్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం..!

హైదరాబాద్, ఆగష్టు 12: విద్యుత్ లైన్‌లలో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏడీఈ కార్యాలయం పరిధిలో నిర్దేశించిన సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అధికారులు తెలిపారు.

డివిజన్‌లోని బన్సీలాల్‌పేట్, మోండామార్కెట్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని రేపు (బుధవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. ప్రధానంగా ఓల్డ్ జైల్‌ఖాన ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఓల్డ్ జైలు ఖాన, సిటీలైట్ హోటల్, విక్టోరియా రాణిగంజ్, అంజయ్య కాంప్లెక్స్ ప్రాంతాలు, అలాగే కేవీ పాలిక బజార్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాలికబజార్, సౌత్ ఇండియా చర్చ్, ప్రకాష్ ఆసుపత్రి ఏరియా, అఫ్జల్ అల్లావుద్దీన్ క్రిస్టల్ ప్లాజా ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ నిలిపి వేయనున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.